PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 272 | విజయవాడ, శుక్రవారం 5 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 5 May 2023 | Rs

సైబర్ వేధింపులకు అడ్డుకట్ట

- జిఓ 1ని పకడ్బందీగా అమలు చేయండి
- హోంశాఖ సమీక్షలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై సోషల్ మీడియా, సైబర్ వేధింపులకు అడ్డుకట్ట వేయాలని, ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో జిఓ నెంబరు 1ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో హోంశాఖపై సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నేరానికీ మూలాలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయని అన్నారు. అక్కడే గుర్తించి తుంచగలిగితే చాలా మందిని కాపాడినట్లవుతుందన్నారు. సోషల్ మీడియా ద్వారా వేధింపుల నుంచి బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి రాజీ వద్దని తెలిపారు. డ్రగ్స్, నార్కోటిక్స్ పంపిణీ వంటివి సోషల్ మాధ్యమాల ద్వారానే జరుగుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాలను పూర్తిగా నివారించేందుకు రవాణా, పంపిణీ, వినియోగంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపాలని, డ్రగ్ పెడలర్స్ పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసులకు కచ్చితమైన ప్రొటోకాల్ వుండాలని సూచించారు. దిశ యాప్ మీద మరోసారి డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లో ఈ యాప్ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక దిశ పోలీస్ స్టేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు ప్రస్తుత విధులు, చేపడుతున్న బాధ్యతలపై సమీక్ష చేయాలన్నారు. అక్రమ మద్యం తయారీ, గంజాయిలో ఉన్న కుటుంబాలను ఆ వృత్తి నుంచి బయటపడేయాలని సూచించారు. వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిని చూపించే మార్గాలను పెంచాలన్నారు. స్పందన కింద వచ్చే అర్జీల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కిందకు స్పందనను తీసుకొస్తున్నామని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులు, ఇతరత్రా నేరాల నివారణకు విద్యాశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖతో పోలీస్‌శాఖ సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉన్నతాధికారులకు జైలుశిక్ష

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో సీనియర్ ఐఎఎస్ ఎమ్‌టి కృష్ణబాబు, సీనియర్ ఐపిఎస్, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు హైకోర్టు నెలరోజుల జైలుశిక్ష విధించింది. రూ.1000 జరిమానా విధించింది. తిరుపతి ఆర్‌టిసి ప్రాంతీయ మేనేజరు టి చంగల్ రెడ్డి, ఆర్‌టిసి చీఫ్ ఇంజినీరు యుఎస్ శ్రీనివాస్, నెల్లూరు ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె కోటేశ్వరరావుకు కూడా అదే శిక్ష, జరిమానాలను విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో వారం రోజులు జైలుశిక్ష అనుభవించాలని చెప్పింది. ఈ నెల 16లోపు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని, తర్వాత వారిని జైలుకు పంపాలని రిజిస్ట్రార్‌కు జస్టిస్ కుంభజడల మన్మథరావు తీర్పు చెప్పారు. సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం ఆర్‌టిసిలో ఫీల్డ్‌మెన్ బి సురేంద్ర సహా నలుగురు 2020లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని వారు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని వేశారు. అప్పీల్ పెండింగ్‌లో ఉందంటూ కోర్టు ఉత్తర్వుల్ని అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని హైకోర్టు తేల్చింది.

అల్లూరి స్ఫూర్తితో మోడీ విధానాలపై పోరు

నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో మోసం • చింతూరు ప్రచారభేరి సభలో బృందాకరత్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు, విఆర్.పురం



బృందా కరత్‌కు కొమ్ముతలపాగ తొడుగుతున్న స్థానిక నాయకులు, వేదికపై సిపిఐ నాయకులు రావుల వెంకయ్య, సిపిఎం నాయకులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు తదితరులు

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న వినాశకర ఆర్థిక, సామాజిక విధానాలపై మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాడాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపునిచ్చారు. 'బిజెపిని సాగనంపుదాం-దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గత నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రారంభమైన ప్రచారభేరి కార్యక్రమం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం డివిజన్‌లో వాడవాడలా సాగింది. ఈ క్రమంలో చింతూరు మండల కేంద్రంలో గురువారం మహా ప్రదర్శన, పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. చింతూరు శబరి ఒడ్డు సంత పాకల నుంచి లారీ యూనియన్ కార్యాలయం, చింతూరు సెంటర్ మీదుగా పాత ప్రభుత్వాస్పత్రి వరకూ భారీ ర్యాలీ కొనసాగింది. వేలాది మంది సిపిఎం, సిపిఐ కార్యకర్తలు ఎర్ర జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ప్రదర్శన ముందు భాగాన గిరిజనుల సంప్రదాయ నృత్యమైన కొమ్ము డోలు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చింతూరు సెంటర్‌లోని అల్లూరి సీతారామ రాజు, కొమరం భీమ్, మల్లు దొర, గంటం దొరల విగ్రహాలకు బృందాకరత్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్య అతిథి బృందాకరత్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. పెట్టుబడిదారులకు ప్రయోజనాన్ని కలిగించేలా విధానాలను రూపొందిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో మోసపూరితంగా వ్యవహరించిందని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి, నివాసం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉన్నా, ఆ పని చేయలేదన్నారు. గ్రామసభలు కూడా నిర్వహించకుండా నిర్ణయాలు చేశారని తెలిపారు. అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు పన్నుల్లో రూ.30 వేల కోట్ల రాయితీలు కల్పించి, సామాన్యులను విస్మరించారన్నారు. బడ్జెట్‌లో ఆహార భద్రత, ఉపాధి చట్టం నిధుల్లో కోత విధించారని తెలిపారు. అనేక ప్రాంతాల్లో ఉపాధి కూలీల పని ప్రాంతాలకు వెళ్లి పరిశీలించామని, అక్కడ వారు చేస్తున్న కష్టానికీ, తీసుకుంటున్న ఆహారానికీ చాలా వ్యత్యాసం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కారం మెతుకులు మాత్రమే తీసుకుంటున్నవారు ఎక్కువమంది ఉన్నారన్నారు. ఇలా ఎలా తింటున్నారని అడిగితే, నిత్యావసరాల ధరలు కొనలేని దుస్థితిలో ఉన్నామని వారు చెప్పారని తెలిపారు. మోడీ మన్ కీ బాత్ వంద సార్లు పెట్టారని, జన్ కీ బాత్

మిగతా 7లో

మరో అమెరికన్ బ్యాంకు దివాలా



సంక్షోభంలో పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంకు

వాషింగ్టన్ : అమెరికన్ బ్యాంకులు ఒక్కొక్కటిగా కుప్పకూలుతున్నాయి. తాజాగా పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంకులో సంక్షోభం చోటుచేసుకుంది. లాస్ ఏంజెల్స్ కేంద్రంగా పనిచేస్తోన్న ఆ బ్యాంకు పతనం అంచున ఉంది. సమస్యల్లో కూరుకుపోవడంతో విక్రయించడం లేదా మూలధనం పెంచే చర్యలు చేపడుతున్నామని స్వయంగా ఆ బ్యాంకు ప్రకటించడంతో పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంకు షేర్లు ఒక్కపూటలో 52 శాతం పతనమయ్యాయి. ఐదు రోజుల్లో 76 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఫీనిక్స్‌కు చెందిన ప్రాంతీయ బ్యాంకు వెస్ట్రన్ అలయన్స్ బ్యాంకు కార్ప్ షేర్లు కూడా భారీ పతనాన్ని చవిచూశాయి. ఇప్పటికే పలు అమెరికన్ బ్యాంకులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఒక్కో బ్యాంకు దివాలా తీస్తోంది. ఇటీవల సిలికాన్ వ్యాలీ బ్యాంకు (ఎస్‌విబి), ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు, సిల్వర్ గేట్ బ్యాంకు, సిగ్నేచర్ బ్యాంకు దివాళా తీసిన విషయం తెలిసిందే. తాజాగా పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంకు కుదుపు అక్కడి బ్యాంకింగ్ పరిశ్రమను గజగజలాడిస్తోంది. ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది. రుణ బకాయిలు పేరుకుపోవడంతో పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంకు సంక్షోభంలో కూరుకుపోయింది. 'తమ రుణాల పోర్ట్‌ఫోలియోను విక్రయించే ప్రక్రియను ఆ బ్యాంకు వేగవంతం చేసింది. వాటాదారుల విలువను కాపాడేందుకు పలు భాగస్వాములు, పెట్టుబడిదారులతో సంప్రదింపులు జరుపుతున్నాము. చర్చలు పురోగతిలో ఉన్నాయి.' అని ఆ బ్యాంకు వెల్లడించింది. సిలికాన్ వ్యాలీ బ్యాంకుతో మొదలైన ఈ సంక్షోభం కొనసాగితే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం లేకపోలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



వెల్లివిరిసిన మతసామరస్యం

- నరసింహస్వామి ఆలయానికి ఆభరణాలు బహూకరించిన ముస్లిములు

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన గురజాలలో మతసామరస్యం వెల్లివిరిసింది. జంగమహేశ్వరపురంలోని నరసింహ స్వామి ఆలయానికి రూ.ఆరు లక్షల విలువైన ఆభరణాలను ముస్లిము సోదరులు గురువారం బహూకరించారు. గురజాలలోని ముస్లిములంతా కలిసి చందాలు వేసుకుని సుమారు రూ.ఆరు లక్షలు సేకరించారు. ఆ మొత్తంతో ఆలయానికి ఆభరణాలను తయారు చేయించారు. వాటితో గురజాలలోని చిన్న మసీదు సెంటర్ నుంచి ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని అర్చకులకు అందజేశారు.

ఎపి భవన్ విభజన

రాష్ట్రానికి 12.09 ఎకరాలు - తెలంగాణకు 7.64 ఎకరాలు

- కేంద్ర తాజా ప్రతిపాదన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధానిలోని ఎపి భవన్ విభజనపై కేంద్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. ఏప్రిల్ 26న కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి (ఇంటర్ స్టేట్) ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశం మినిట్స్‌ను గురువారం విడుదల చేసింది. మొత్తం 19.73 ఎకరాల్లో 12.09 ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌కు, 7.64 ఎకరాలు తెలంగాణకు ప్రతిపాదించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల ప్రకారం దేశ రాజధానిలోని ఆంధ్రభవన్‌లోని ఆస్తుల విభజన సమస్య చర్చించి, పరిష్కరించడానికి ఎపి, తెలంగాణ ప్రతినిధులతో సంయుక్త కార్యదర్శి అధ్యక్షతన 2023 ఏప్రిల్ 26న సమావేశం నిర్వహించామని మినిట్స్‌లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు, తెలంగాణ రెండు ఆప్షన్లు ఉన్నాయని తెలపగా... కేంద్రం ఆప్షన్-ఇతో ముందుకొచ్చింది. కేంద్రం ప్రతిపాదన ఆచరణయోగ్యంగా ఉందని ఎపి స్వాగతించిందని హోంశాఖ పేర్కొంది. సమావేశం ప్రారంభ సమయంలో రెండు రాష్ట్రాల అభిప్రాయాలు చెప్పాలని సంయుక్త కార్యదర్శి కోరారని తెలిపింది. ఎపి భవన్ విభజనకు మూడు ఆప్షన్లు (ఎ, బి, సి) ఉన్నాయని ఎపి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం స్పందిస్తే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపిందని హోంశాఖ పేర్కొంది. తమకు రెండు ఆప్షన్లు (సి, డి) ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారని పేర్కొంది. ఆప్షన్-డిలో భాగంగా పటౌడ్ హౌస్ భూమి 7.64 ఎకరాలు మినహా ఇప్పటికే ఉన్న భవనాలు 12.09 ఎకరాలతోపాటు గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్‌తో కూడిన మొత్తం భూమిని తెలంగాణ కోరుకుంటోందని తెలిపింది. జనాభా నిష్పత్తి ప్రకారం ఈ ప్రతిపాదన ఎక్కువగా ఉంటుంది కాబట్టి అదనపు భూమి కోసం ఆంధ్రప్రదేశ్‌కు 2/3 విలువతో కూడిన ఆర్థిక సర్దుబాటు తెలంగాణ చేస్తామని చెప్పిందని పేర్కొంది. ఆప్షన్-సిని తెలంగాణ గతంలోనే వ్యక్తపరిచిందని తెలిపింది. అయితే, తెలంగాణ తాజా ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడానికి ముందుకెళ్తామని ఎపి ప్రభుత్వం తెలిపిందని హోంశాఖ పేర్కొంది. అనంతరం కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆప్షన్-ఇతో ముందుకొచ్చారని తెలిపింది. ఇది ఆప్షన్-డికి వ్యతిరేకమని పేర్కొంది. పటౌడీ హౌస్ మొత్తం 7.64 ఎకరాలు తెలంగాణకు, గోదావరి, శబరి బ్లాకులున్న

మిగతా 7లో

పంట నష్టంపై 15 రోజుల్లో తుది జాబితా

- వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది

• లోపలి పేజీలో.. •

పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

- ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్

• లోపలి పేజీలో.. •

అర్ధరాత్రి అరాచక దాడి

ఉద్యమిస్తున్న రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల క్రౌర్యం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- దాడి చేసిన పోలీసుల్లో మందుబాబులు
- అసభ్యంగా ప్రవర్తించారంటూ మహిళా యోధుల కంటతడి
- పతకాలు వెనక్కిచ్చేస్తామని ప్రకటన
- మద్దతుదారులను వదలని ఖాకీలు



అంతర్జాతీయ వేదికలపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించిన రెజ్లర్లు వీరు. మోడీ సర్కారు నిరంకుశ చర్యలతో జంతర్‌మంతర్ వద్ద ఇలా కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశం కోసం అంతర్జాతీయ వేదికలపై పోరాడిన మహిళా రెజ్లర్లపై బుధవారం అర్ధరాత్రి ఢిల్లీ పోలీసులు దాడికి దిగారు. మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించారు. వారి దాడిలో రెజ్లర్ దుష్యంత్ తలపగిలింది. మరో రెజ్లర్ రాకేష్ యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైన వారిద్దరినీ రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని 12 రోజులుగా జంతర్ మంతర్ వద్ద దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజులుగా భారీ వర్షాలు పడటంతో రెజ్లర్లు బస చేసే ప్రాంతంలో నీరు చేసి, సామాగ్రి అంతా తడిచిపోయింది. వారు బస చేసేందుకు మడత మంచాలు (ఫోల్డబుల్ మంచాలు) తెచ్చుకునేందుకు ప్రయత్నించగా, పోలీసులు గందరగోళం సృష్టించారు. ఆ సమయంలోనే ఆప్ ఎమ్మెల్యే సోమనాథ్ భారతి రావడంతో అప్పటికే అక్కడికి చేరుకున్న వందలాది మంది పోలీసులు ఆందోళనకారులను, మీడియా ప్రతినిధులను ఈడ్చిపారేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు) ఛైర్‌పర్సన్ స్వాతి మాలివల్ జంతర్ మంతర్‌కు చేరుకోగా, ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. దురుసుగా ప్రవర్తించారు. ఆమెతోపాటు హర్యానా కాంగ్రెస్ ఎంపి దీపేందర్ హుడా, ఆప్ ఎమ్మెల్యే సోమనాథ్ భారతిలను పోలీసులు అరెస్టు చేశారు. మహిళ మీడియా ప్రతినిధులను, రైతు సంఘాల నేతలను అరెస్టు చేశారు.

గీతా ఫొగాట్ అడ్డగింత

గురువారం జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. అనేక ఆంక్షలు పెట్టారు. రెజ్లర్లకు మద్దతుగా

మిగతా 2లో

పశుబీమాపై ఉదాసీనత

- ఈ ఏడాది జనవరిలోనే కొత్త పథకంపై జిఒ
- కేంద్రం జాప్యంతో అమలు కాని వైనం
- మరణించిన పశువులకు అందని పరిహారం



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వైఎస్ఆర్ పశుబీమా పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. తాను ఇవ్వాల్సిన ప్రీమియం డబ్బులు ఇవ్వకపోవంతో ఈ పథకం అమలుకు నోచుకోలేదు. దీంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది అక్టోబరు వరకు వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకం తీసుకొచ్చింది. లబ్ధిదారుల నుంచి ఎటువంటి ప్రీమియం వసూలు చేసేది కాదు. ఈ పథకానికి గత ఏడాది అక్టోబర్‌లో స్వస్తి పలికింది. కొత్తగా వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సాయంతో అమలుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందిస్తూ ఈ ఏడాది జనవరి 12న జిఒ నంబర్ 3ను విడుదల చేసింది. ఎస్‌సి, ఎస్‌టి, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న రైతుల నుంచి 20 శాతం ప్రీమియం వసూలు చేయనున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, జాతీయ పశు సంపద మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం 40 శాతం ప్రీమియం భరించనున్నట్లు ఈ జిఒలో తెలిపింది. దారిద్ర్యరేఖకు ఎగువనున్న పాడి రైతులు 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, కేంద్రం, రాష్ట్రం చెరో 25 శాతం వాటా భరిస్తాయని పేర్కొంది. ఎద్దు చనిపోతే గతంలో పరిహారం వచ్చేది కాదు. ప్రస్తుతం ఆవు, గేదె మాదిరిగా ఎద్దుకు కూడా బీమా వర్తింపజేస్తున్నట్లు జిఒలో పేర్కొంది. కనీసం మూడు పశువులు చనిపోతేనే పరిహారం చెల్లించాలన్న గత నిబంధనను సవరించి ఒక పశువు మరణించినా పరిహారం వర్తింపజేయనున్నట్లు మార్గదర్శకాల్లో తెలిపింది. పాత పథకంలో గొర్రెలు, మేకలు, పందులు 30 వరకు చనిపోతేనే పరిహారం దక్కేది. కొత్త పథకంలో ఆ సంఖ్యను 50కు పెంచింది. కేంద్రం తన వాటాపై స్పందించకపోవడంతో పథకం అమలుకు నోచుకోవడం లేదు.

19 నెలలుగా వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకం క్లయిములు పెండింగ్

వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 84 వేలకుపైగా క్లయిములు అపరిష్కృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతి చెందిన మేలుజాతి పశువుకు రూ.30 వేలు, సాధారణ పశువుకు రూ.15 వేలు, గొర్రె లేక మేక లేక పందికి రూ.ఆరు వేలు చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంది. సుమారు రూ.200 కోట్ల వరకు బీమా క్లయిమ్‌లు ఆగిపోయినట్లు సమాచారం. పరిహారం చెల్లింపు కోసం అప్‌లోడ్ చేస్తున్నా సాంకేతిక కారణాలతో బిల్లులు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి తిరస్కరణకు గురవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ సమస్య పరిష్కారంపై ఆర్థిక శాఖ దృష్టి సారించకపోవడంతో క్లయిము డబ్బులు చెల్లింపు అంశం అపరిష్కృతంగా ఉంది. బకాయి క్లయిములను వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ సంబరాలు

సిమ్లాలో మట్టికరిచిన బిజెపి

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా
- ఒక స్థానంలో సిపిఎం విజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార బిజెపి మట్టికరిచింది. మొత్తం 34 వార్డులకు ఎన్నికలు జరగ్గా, కాంగ్రెస్ 24 వార్డుల్లో విజయం సాధించింది. ఇప్పటివరకూ అధికారంలో ఉన్న బిజెపి అతికష్టం మీద తొమ్మిది వార్డుల్లోనే గెలుపొందింది. సిపిఎం ఒక వార్డులో విజయం సాధించింది. 21 స్థానాల్లో పోటీ చేసిన ఆప్ ఖాతా తెరవలేదు. తొమ్మిదిమంది స్వతంత్రులు ఓటమి పాలయ్యారు. మొత్తం 102 మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 2017 ఎన్నికల్లో కాంగ్రెస్ 12, బిజెపి 17, స్వతంత్రులు నాలుగు, సిపిఎం అభ్యర్థి ఒక వార్డులో గెలిచారు. హిమాచల్ ప్రదేశ్‌లో డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వాటికి ముందుగా జరిగిన ఈ ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలవడం గమనార్హం. సిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ గడువు గత ఏడాది జూన్‌తోనే ముగిసింది. ఏడాది ఆలస్యంగా ఈ ఎన్నికలు జరిగాయి.


25 ఏళ్లగా 'సమ్మర్ హిల్'లో సిపిఎం విజయ పరంపర

సిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఎం సమ్మర్ హిల్ స్థానంలో ఘన విజయం సాధించింది. నాలుగు స్థానాల్లో బరిలో దిగిన సిపిఎం శాంతి స్థానంలో 680పైగా ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. గత 25 ఏళ్లుగా సమ్మర్ హిల్ స్థానంలో సిపిఎం విజయ పరంపర కొనసాగుతోంది. ఈసారి అక్కడి నుంచి సిపిఎం తరపున వీరేంద్ర ఠాకూర్ గెలుపొందారు.

రైతులను నిండా ముంచేశారు..!

- దగా కేంద్రాలుగా ఆర్‌బికెలు
- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పర్యటనలో చంద్రబాబు

• లోపలి పేజీలో.. •



ప్రభుత్వ బ్యాంక్‌లకు ఐదే పని దినాలు..!

• లోపలి పేజీలో.. •

ఆర్‌టిసిలో కనెక్టివిటి రిజర్వేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్‌టిసి మరో సేవను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి దాకా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నేరుగా వెళ్లేందుకు మాత్రమే రిజర్వేషన్ చేసుకునే అవకాశం వుండేది. ఇకపై బస్సు మారి మరో బస్సులో తమ గమ్య స్థానాలకు వెళ్లేవారి కోసం మల్టీ లెగ్ జర్నీ బస్ టికెటింగ్ సిస్టిమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ రిజర్వేషన్ ప్రక్రియతో అన్ని జిల్లా కేంద్రాలతోపాటు ముఖ్యమైన పట్టణాలు, నగరాలు, పొరుగు రాష్ట్రాల్లోని నగరాలకు మల్టీ లెగ్ బస్ టికెటింగ్ సిస్టిమ్‌ను ఆర్‌టిసి అందుబాటులోకి తెచ్చింది. ఇపుడు ప్రస్తుతం ఆర్‌టిసిలో 4,077 బస్సులకు సగటున 50 వేల మందికి పైగా ప్రయాణికులు రిజర్వేషన్ ప్రక్రియను వినియోగిస్తున్నారు. మల్టీ లెగ్ బస్ టికెటింగ్ సిస్టిమ్‌తో బస్సు మారినప్పుడల్లా రిజర్వేషన్ చేసుకునే పనిలేకుండా తాము ఎక్కిన బస్సును దిగి మరో బస్సుకు రిజర్వేషన్ చేసుకునే శ్రమ తగ్గుతుంది. ఇప్పుడున్న రిజర్వేషన్ వెబ్‌సైట్లలోనే మల్టీ లెగ్ బస్ టికెటింగ్ సిస్టిమ్ కింద రిజర్వేషన్ చేసుకోవచ్చు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి కోరింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఉపాధ్యాయ సంఘాలతో నేడు మంత్రి బొత్స చర్చలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం సమావేశం కానున్నారు. విజయవాడలోని సమగ్ర శిక్షా అభియాన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, యాప్‌లు, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌పై చర్చ జరగనుంది.

ఢిల్లీలో బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) జాతీయ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. గురువారం నాడిక్కడ వసంత్ విహార్‌లో నిడారంబరంగా బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభమైంది. మధ్యాహ్నం 1:05 గంటలకు రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయంలోకి కెసిఆర్ అడుగుపెట్టారు. అనంతరం హోమ్‌లో నిర్వహించిన ఛండీ అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షులుగా తనకు కేటాయించిన సీట్లో కూర్చొని కాసేపు నేతలతో ముచ్చటించారు.పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో భాగంగా కెసిఆర్ వసంత్ విహార్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎంపిలు స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ జెండా, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని కెసిఆర్ ఆవిష్కరించారు.

రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలు ముమ్మరం

- రైతుల ఇబ్బందులపై టోల్ ఫ్రీ నెంబరు
- అకాల వర్షాలపై సమీక్షలో సిఎం జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేయాలని, రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలవాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతుల్లో ఏ ఒక్కరికీ పరిహారం అందలేదన్న మాట రాకుండా చూడాలని, నష్టపోయిన రైతులకు పూర్తిగా అండగా నిలవాలన్నారు. రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. అకాల వర్షాల అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎం సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల రైతులకు కలిగిన పంట సహా ఇతర నష్టాలకు సంబంధించి గ్రామ సచివాలయాల స్థాయి నుంచే నిరంతరం వివరాలు తెప్పించుకోవాలని, ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీల కోసం పెట్టాలని సిఎం సూచించారు. ఎవరైనా మిగిలిపోయినవారు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. పంట కొనుగోలు చేయడం లేదన్న మాట ఎక్కడా వినిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేయాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో వర్షాల వల్ల పంట నష్టం తదితర అంశాలపై ప్రాథమికంగా అందిన వివరాలను సిఎంకు అధికారులు వివరించారు. రైతులను ఆదుకునేందుకు చేపట్టిన ఇతరత్రా చర్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. రబీధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా ముందుకు సాగుతోందని, ఇప్పటి వరకు 4.75 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. పంట కోయని ప్రాంతాల్లో ఏం చేయాలన్న దానిపై రైతులకు సూచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని, వివిధ కొనుగోలు కేంద్రాలు, ఆర్‌బికెలు, రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను భద్రంగా ప్రభుత్వ భవనాలు, గోడౌన్లలోకి పంపిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి జిల్లాలోనూ కంట్రోల్ రూమ్స్ తెరిచామని, యంత్రాంగమంతా అందుబాటులో ఉందని అధికారులు సిఎంకు వివరించారు.

ఆత్మహత్యలు నిరోధించడంలో మీడియాదే కీలక పాత్ర

- ఎన్‌సిడి ప్రాజెక్టు అధికారి సిహెచ్ మానస

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం ఉంటుందన్న విషయం గుర్తిస్తే బలవన్మరణాలను నిరోధించవచ్చని, మానసిక సమస్యలు, ఆత్మహత్యలను నివారించడంలో మీడియా క్రియాశీలక పాత్ర పోషించాలని ఎన్‌సిడి ప్రాజెక్టు అధికారి సిహెచ్ మానస తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ఆధారంగా ఆత్మహత్యలపై వార్తా కథనాలు ఎలా వుండాలనే అంశంపై నిమ్ హాన్స్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు బెంగళూరు నుంచి నిర్వహించిన జూమ్ సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ప్రొఫెసర్ అనీష్ చెరియన్, సిహెచ్ మానస, ప్రొఫెసర్ ఆర్య తిరుమేని మాట్లాడారు. ప్రతి సమస్యకూ పరిష్కారముంటుందని, ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడేవారి సమస్యకు పరిష్కారాలున్నాయని, మరణమే శరణ్యం కాదని వివరించే ప్రయత్నం చేయాలన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 14416 టోల్ ఫ్రీ నెంబరుతో టెలి మానస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. తీవ్ర మానసిక సమస్యలతో బాధపడేవారైనా టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే మానసిక వైద్య నిపుణులు సదరు సమస్యకు సరైన పరిష్కార మార్గాన్ని చెబుతారన్నారు. ఏలూరు జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మానసిక సమస్యలు-ఆత్మహత్యల నిరోధంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఆత్మహత్యల వార్తాంశాలను ప్రముఖంగా ప్రచురించవద్దని, దీనివల్ల అప్పటికే మానసికంగా ఒత్తిడిలో వున్నవారు మరింత ఒత్తిడికి లోనై ఇదే పరిష్కారాన్ని అంచనాతో ఆత్మహత్య చేసుకునే అవకాశం వుందన్నారు. ఆత్మహత్యలకు సంబంధించి వార్తా కథనాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రెస్ కౌన్సిల్ అఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలకు లోబడి ప్రచురించేలా చూడాలని కోరారు.

పంట నష్టంపై 15 రోజుల్లో తుది జాబితా

- వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వర్షాలు ఆగిన అనంతరం పంట నష్టం అంచనాలు వేసి 15 రోజుల్లో తుది జాబితాను వెల్లడిస్తామని వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో గురువారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్ కలిసి మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని సిఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, ఐఎండి సూచనల ప్రకారం అకాల వర్షాలు ఈ నెల 8 వరకు ఉండే అవకాశం ఉందన్నారు. అనంతరం వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి పంట నష్టపోయిన వారి జాబితాను ఆర్‌బికెల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కోయాల్సిన పంట (స్టాండింగ్ క్రాప్), కోసిన పంట (హార్వెస్టింగ్ క్రాప్) విషయంలో రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా ఉండేందు నష్టాన్ని తగ్గించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలను రైతులు తప్పక పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే సమీప రైతు భరోసా కేంద్రాన్ని సమీపించాలని లేదా వ్యవసాయశాఖ టోల్ ఫ్రీ నెంబరు 155251కు ఫిర్యాదు చేస్తే కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేస్తామన్నారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనరు హరికిరణ్ మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగాన్ని ఆర్‌బికెల స్థాయి వరకు అప్రమత్తం చేశామన్నారు. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఖరీఫ్ 2023 సీజన్ ప్రారంభంలోనే ఈ నష్టపరిహారాన్ని అందజేస్తామన్నారు. మార్చిలో కురిసిన అకాల వర్షాలకు 23,473 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, వాటిలో వ్యవసాయ పంటలు 17,820 హెక్టార్లు, 5,652 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీగా మొత్తం రూ.34.22 కోట్లు వచ్చే ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. పంట నష్ట పరిహారం కింద ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.1,900 కోట్లు జమచేశామన్నారు.

పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో




ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ప్రైవేటీకరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు 50 శాతం వాటాను కట్టబెట్టేలా రాష్ట్ర ఎపి సహకార సంఘాల చట్టం 1964కు సవరణ చేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. సహకార సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాలు, ఉద్యోగులతో చర్చించకుండా ఏకపక్షంగా చట్టసవరణ చేయడం తగదని పేర్కొంది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మీడియాతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం సహకార రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందని, తాము అధికారంలోకి వస్తే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు పూర్తిగా ప్రైవేటుపరం చేసేందుకు చట్టసవరణ చేశారని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌లలో విలీనం చేయడం, వృత్తి నిపుణులకు, ఫైనాన్స్ బ్యాంకు ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు ఓటింగ్ హక్కును కల్పించడం సరైందికాదన్నారు. రైతు కేంద్రాల పనితీరు భేష్ అని భుజాలను తడుముకునే జగన్ ప్రభుత్వం పిఎసిఎస్‌లో విలీనం ఎందుకు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకే రాష్ట్ర ప్రభుత్వం పిఎసిఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. పిఎసిఎస్‌లలోనే కామన్ సర్వీస్‌లను పెంచుకునే వెసులుబాటు వున్నా కేవలం ప్రైవేటీకరించేందుకే చట్టసవరణ చేశారని విమర్శించారు. కేరళలో ఎలాంటి చట్టసవరణ చేయకుండానే పిఎసిఎస్‌లలో పౌరసేవలను అందిస్తున్నాయని అన్నారు. తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు చట్టసవరణ చేయకుండానే అన్ని రకాల సేవలనూ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. పిఎసిఎస్‌లలోని ఉద్యోగులకు వేతన సవరణను 2014 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాల్సిన ప్రభుత్వం చేయకుండా ఏకంగా పిఎసిఎస్‌లను నిర్వీర్యం చేసేలా చట్టసవరణ చేసిందని విమర్శించారు. పిఎసిఎస్‌లను ప్రైవేటీకరించే యత్నాలను అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతు సంఘాలు, పిఎసిఎస్ ఉద్యోగ సంఘాలతో చర్చించి పిఎసిఎస్‌లను పూర్తిగా రైతుల అజమాయిషీలోనే వుంచాలని డిమాండ్ చేశారు.

వెలుగొండ టన్నెల్‌లోకి వరద

- మొదటి, రెండో టన్నెల్‌లో భారీగా చేరిన నీరు
- మునిగిపోయిన యంత్ర సామాగ్రి
- నిలిచిన ప్రాజెక్టు పనులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)



ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలుగొండ ప్రాజెక్టు మొదటి, రెండో టన్నెల్‌లోకి భారీగా వరద నీరు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరడంతో రెండు టన్నెళ్లు నీట మునిగాయని వెలుగొండ ప్రాజెక్టు ఇఇ అబుత్ అలీమ్ తెలిపారు. మొదటి టన్నెల్‌లో ఆరు అడుగులు, రెండో టన్నెల్‌లో ఇరవై అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. దీంతో యంత్ర పరికరాలన్నీ నీటమునిగాయి. ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. వరద నీరంతా బయటకు తోడి తిరిగి పనులు ప్రారంభించాలంటే మరో పది రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. టన్నెల్‌లో ఎక్కడో పెద్ద గండి పడి ఉంటుందని, దాని ద్వారానే భారీగా నీరు చేరిందని భావిస్తున్నారు. అధికారులు శాశ్వతమైన పనులు చేపట్టకపోవడంతోనే ఇలా జరిగి ఉంటుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి విమర్శించారు. అక్టోబర్‌లో ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి నీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం వేసవిలో అరకొరగా కురిసిన వర్షానికే ప్రాజెక్టు నీట మునిగితే ఇక వర్షాకాలంలో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికైనా అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడనాడి మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారులతో సమీక్షించిన మంత్రి సురేష్..

వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్లోకి నీరు చేరిన విషయం తెలుసుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎగువన ఉన్న కొల్లంవాగు వద్ద భారీగా కురిసిన వర్షానికి వరద నీరు టన్నెల్లోకి చేరిందన్నారు. వరద నీరు చేరికతో ప్రస్తుతం పనులు నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. తక్షణమే మోటార్లతో నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టి నాలుగు రోజుల్లో తిరిగి పనులు ప్రారంభిస్తారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో పనుల్లో జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో ప్రాజెక్టును పరిశీలిస్తానని తెలిపారు.

అర్ధరాత్రి అరాచక దాడి

(మొదటి పేజీ తరువాయి)

జంతర్ మంతర్‌కు చేరుకున్న వారిని ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. రెజ్లర్ గీతా ఫొగాట్‌ను కర్నాల్ బైపాస్‌పై ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీలో ప్రవేశించకుండా తనను అడ్డుకున్నారని ఆమె ట్వీట్ చేశారు. సింఘూ సరిహద్దు వద్ద రైతులను అరెస్టు చేసి బవానా సెక్టార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెజ్లర్లకు బాలీవుడ్ నటి గౌహర్ ఖాన్ మద్దతు తెలిపారు.

ఢిల్లీ పోలీసులు మద్యం తాగి అసభ్య ప్రవర్తన

ఢిల్లీ పోలీసులు పీకలదాకా మద్యం తాగి తమను దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారని మహిళా రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ ఫొగాట్ ఆవేదన వ్యక్తం చేశారు. "నన్ను మగ పోలీసులు దుర్భాషలాడి చుట్టూ నెట్టారు. మమ్మల్ని చంపాలనుకుంటే చంపండి. ఈ రోజు చూడ్డానికి మేం దేశం కోసం పతకాలు సాధించామా? మేం తిండి కూడా తినలేదు. మహిళలను దుర్భాషలాడే హక్కు ప్రతి పురుషుడికీ ఉందా? ఈ పోలీసులు తుపాకులు పట్టుకున్నారు. వారు మమ్మల్ని చంపగలరు" అని ఖేల్‌రత్న అవార్డు గ్రహీత వినేష్ ఫొగాట్ కన్నీరు పెట్టుకున్నారు. "వర్షం కారణంగా పరుపులు తడిసిపోయాయి. మడత మంచాలు తీసుకొస్తుండగా, పోలీసులు అనుమతించలేదు. మద్యం మత్తులో ఉన్న పోలీసు ధర్మేంద్ర రెజ్లర్ వినేష్ ఫోగట్‌ను దుర్భాషలాడాడు. మాతో గొడవకు దిగాడు" అని మాజీ రెజ్లర్ రాజ్‌వీర్ పేర్కొన్నారు.

మా పతకాలు, అవార్డులు తిరిగి ఇచ్చేస్తాం

"మా రెజ్లర్ల పట్ల ఇలాగే వ్యవహరిస్తే, మేం పతకాలను ఏమి చేస్తాం? దీనికి బదులుగా సాధారణ జీవితాన్ని గడుపుతాం. అన్ని పతకాలు, అవార్డులను తిరిగి ఇచ్చేస్తాం" అని ఒలింపిక్ కాంస్య పతక విజేత బజరంగ్ పునియా, వినేష్ అన్నారు.

రెజ్లర్లను వేధించే బదులు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం పేర్కొంది. నిరసనకారులను వేధించే బదులు నేరుగా హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని ఢిల్లీ పోలీసులు బిజెపి, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని హితవు పలికింది. బేటీ బచావో నినాదం పక్కకు వెళ్లిపోయిందని పేర్కొంది. దేశంలోని రెజ్లర్లు, రైతులు, జర్నలిస్టులు, యువతను అరెస్టు చేయడం దేశంలో కొత్త విప్లవానికి నాంది పలుకుతుందని రైతు నేత రాకేష్ తికాయత్ ఎద్దేవా చేశారు. రెజ్లర్లపై క్రూరమైన దాడి వారి నిరసనను విధ్వంసం చేసే కుట్రకు పరాకాష్ట అని డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపి ఎఎ రహీం అన్నారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, బ్రిజ్ భూషణ్‌ను వెంటనే కటకటాల వెనక్కి నెట్టాలని డిమాండ్ చేశారు.

రెజ్లర్లపై అమానుష ప్రవర్తనకు కేజ్రీవాల్, మమత, రాహుల్ ఖండన

అంతర్జాతీయ వేదికలపై దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన రెజ్లర్లపై రాత్రిపూట ఢిల్లీ పోలీసులు ప్రవర్తించిన తీరు సిగ్గు చేటని, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ సిఎంలు అరవింద్ కేజ్రీవాల్, మమతాబెనర్జీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా మార్చ్ చేపట్టిన ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థినుల పట్ల ఢిల్లీ పోలీసులు అన్యాయంగా ప్రవర్తించిన తీరు బాధాకరమని, కలవరం కలిగిస్తోందని ఎన్‌సిపి అధినేత శరద్ పవర్ పేర్కొన్నారు.

రెజ్లర్ల పిటిషన్‌పై ముగిసిన సుప్రీం విచారణ

మహిళా రెజ్లర్ల ఫిర్యాదులపై డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు గురువారం విచారణను ముగించింది. తదుపరి ఉపశమనం కోసం ఫిర్యాదుదారులు అధికార మేజిస్ట్రేట్ కోర్టు లేదా ఢిల్లీ హైకోర్టును సంప్రదించవచ్చని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. విచారణను పర్యవేక్షించాలని ఫిర్యాదుదారుల తరపు న్యాయవాది కోరగా, ధర్మాసనం నిరాకరించింది.



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

'ఉక్కు'పై కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 812వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ టిపిపి, ఆర్ఇడిపి, ఇఎం, స్టోర్స్, ఎస్ఎండి కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వైటి.దాస్, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి మాట్లాడారు. మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్ని కుంటుపరుస్తూ, ఉక్కు ఉత్పత్తులకు కావాల్సిన రా మెటీరియల్‌ను కొనుగోలు చేయకుండా ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తోందని తెలిపారు. కేంద్రం కుటిలయత్నాలను తిప్పికొట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపిలు విఫలమవుతున్నాయన్నారు. కార్మికుల పోరాటానికి రాజకీయ పార్టీల మద్దతు కూడా అవసరమని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రాస్తారోకోల్లో పాల్గొన్న ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. దీక్షల్లో నాయకులు డి.శ్రీనివాస్, శ్రీనివాస్ నాయుడు, బిఎంఎల్.నాయుడు, జి.నరేంద్ర తదితరులు కూర్చున్నారు.

డిగ్రీ, పిజి కళాశాలల ఫీజుల ధ్రువీకరణ తప్పనిసరి

- ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ, పిజి కళాశాలలు కోర్సుల ఫీజుల ధ్రువీకరణ తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ కార్యదర్శి సభ్యులు సూర్యచంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పిజి కళాశాలలు అందిస్తున్న కోర్సులకు కమిషన్ నుంచి విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులను ధ్రువీకరించాల్సి ఉందని తెలిపారు. అగ్రికల్చరల్, హార్టికల్చరల్, మెడికల్, డెంటల్, ఇంజినీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, ఫిజికల్ విద్య, లా కోర్సులకు విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులపై వ్యక్తిగత విచారణ పూర్తిచేశామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు డిగ్రీ, పిజి కోర్సుల ఫీజులపై విచారణ జరుపుతామని వివరించారు. కోర్సుల ఫీజులను కమిషన్ ధ్రువీకరించని పక్షంలో ఆయా కోర్సులకు ఉమ్మడి ప్రవేశపరీక్షల కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులను చేర్చుకోవడం కుదరదని స్పష్టం చేశారు.

నేడు వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీతోఫా కింద జనవరి - మార్చి త్రైమాసికంలో వివాహం చేసుకుని అర్హులైన 12,132 మంది లబ్ధిదారులకు రూ.87.32 కోట్లు ఆర్థికసాయాన్ని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సిఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

ఆక్రమణల్ని తొలగించండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు రూరల్ మండలం, అల్లీపురంలోని ప్రధాన పంట కాలువలు, కాలువ పోరంబోకు స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి వెంచర్లు వేస్తున్నారనే అభియోగాల పిల్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆక్రమణల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లను 2 నెలల్లోగా తొలగించాలని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను ఆదేశించింది. సర్వే రిపోర్టుల ప్రకారం ఆక్రమణల్ని తొలగించాలని జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పు చెప్పారు. కోడూరు, లేబూరు మేజర్ కాలువలతోపాటు ఇతర ఛానల్స్ ఆక్రమించి, వెంచర్లు వేస్తున్నారంటూ రూరల్ మండలం, గుడిపల్లిపాడుకు చెందిన మేకల అనిల్ పిల్ వేశారు. చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

నిర్మాణాలే పూర్తి కాలేదు అప్పుడే అద్దె వసూళ్లు!

- రూ.6.3 కోట్లు చెల్లించాలని జిఎడికి సిఆర్‌డిఎ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆలూలేదు.. చూలూ లేదు... అన్నట్లుగా ఉంది రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ తీరు. రాజధాని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనాలపై అద్దె చెల్లించాలని సాధారణ పరిపాలనశాఖకు లేఖ రాశారు. రాజధాని నిర్మాణం కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు ఈ అద్దె సొమ్ము ఎంతో అవసరమని పేర్కొనడం గమనార్హం. మొత్తం నెలకు రూ.6.30 కోట్లు అద్దెగా ఇవ్వాల్సి ఉంటుందని కూడా లేఖలో పేర్కొన్నారు.

రాజధాని ప్రాంతంలోని రాయపూడి, నేలపాడు గ్రామాల్లో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అఖిలభారత సర్వీసు అధికారులు, ఇతర ఎన్‌జిఒలకు భవనాల నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ భవనాల నిర్మాణం ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా తుప్పలు, ఇతర వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తోంది. ఈ భవనాలను పూర్తయినట్లుగా అధికారులు చెబుతుండడం విశేషం.

ఈ భవనాలను సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తూ ఆ శాఖ నుంచి అద్దె వసూలు చేసేందుకు గత ఫిబ్రవరిలో సిఆర్‌డిఎ, జిఎడి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ భవనాల్లో మొత్తం 3,840 యూనిట్లు ఉన్నాయి. ఇందులో 3,201 యూనిట్లు లీజుకు అర్హత కలిగినవిగా ఉన్నట్లు సిఆర్‌డిఎ అధికారులు పేర్కొన్నారు. ఏ భవనాల్లోని యూనిట్లకు ఎంత అద్దె ఇవ్వాలన్నది కూడా ఒప్పందంలో ఖరారు చేసుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే క్వార్టర్లకు రూ.50 వేలు, ఎఐఎస్ అధికారుల క్వార్టర్లకు రూ.40 వేలు, ఉద్యోగుల వసతికి రూ.15 వేలుగా అద్దె ఖరారు చేశారు. ఇలా వచ్చే అద్దెను తమకు రుణమిచ్చిన యూనియన్ బ్యాంకుకు వాయిదాలుగా చెల్లించాలని సిఆర్‌డిఎ అధికారులు నిర్ణయించారు. ఎస్క్రో విధానం ద్వారా భవిష్యత్తు ఆదాయాన్ని రుణానికి చెల్లిస్తామని బ్యాంకుతో జరిగిన ఒప్పందాన్ని కూడా అధికారులు గుర్తు చేస్తున్నారు. అందుకే బ్యాంకు వాయిదాలు చెల్లించేందుకు ఈ అద్దె డబ్బులను వెంటనే ఇవ్వాలని సాధారణ పరిపాలన శాఖకు లేఖ రాయడం తాజా పరిణామం.

వసతి, క్వార్టర్లు, అద్దె వివరాలు (రూ.కోట్లలో)

విభాగం	క్వార్టర్లు	నెల అద్దె	మొత్తం నెలకు
ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ	288	50,000	1,44,00,000
ఏఐఎస్ అధికారులు	144	40,000	57,60,000
నాన్ గెజిటెడ్	1,488	15,000	2,23,20,200
గెజిటెడ్ అధికారులు	288	25,200	72,00,000
గెజిటెడ్ గ్రేడ్-2	273	20,000	54,60,000
గ్రూప్-డి ఉద్యోగులు	720	11,000	79,20,000
మొత్తం	**3,201**	**---**	**6,30,60,000**

ఉపాధ్యాయురాలు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు.. పరిస్థితి విషమించి గురువారం మరణించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆమె మరణించారని ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయురాలు పాలకూటి కృపాకుమారి(55) షుగర్ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రమవడంతో స్థానిక నిర్మల ప్రయివేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. ప్రాథమిక వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఏలూరుకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో ఆమె మరణించారు. నిర్మల ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కృపాకుమారి మరణించారని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతదేహంతో ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఆసుపత్రిలోని సామాగ్రిని ధ్వంసం చేశారు. బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఫర్నిచర్ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

- రూ.కోటి ఆస్తినష్టం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఫర్నిచర్ తయారీ గొడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగి దాదాపు కోటి రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ సంఘటన చిత్తూరులోని దర్గా సర్కిల్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రమైన దర్గా సర్కిల్ సమీపంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న షాదిక్ ఫర్నీచర్ మ్యానిఫ్యాక్చరింగ్ గోడౌన్‌లో కుషన్ బెడ్లు, దీవాన్‌కాట్, సోఫాసెట్లు తయారు చేస్తుంటారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గొడౌన్‌లో మంటలు చెలరేగాయి. గొడౌన్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి బయటకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకున్నారు. చిత్తూరు, పలమనేరు, పాకాలకు చెందిన ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. దాదాపు రెండు గంటల తరువాత మంటలు అదుపులోకి వచ్చాయి. సమీపంలోనే కారు పార్కింగ్ ఉండడంతో అందులో పార్కింగ్ చేసిన వాహనాలు దెబ్బతిన్నాయి. సంఘటనా స్థలాన్ని చిత్తూరు ఆర్‌డిఒ రేణుక, డిఎస్‌పి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగివుండవచ్చునని భావిస్తున్నారు.

రైతులను నిండా ముంచేశారు..!

- దగా కేంద్రాలుగా ఆర్‌బికెలు
- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పర్యటనలో చంద్రబాబు


తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు ప్రభావతి

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వం తన అసమర్థతతోనే రైతులను నిండా ముంచేసిందని మాజీ సిఎం, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితులు చూస్తేంటే కడుపు తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం నాచుగుంట, పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం నందమూరు, అబేద్కర్ కోనసీమ జిల్లా ఆలూరులోని జొన్నాడ, మండపేట,రామచంద్రపురం మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. పొలాల్లో తడిసిన రాశులను, మొలకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతు జువ్వలపల్లి ప్రభావతి, రైతులు సుంకవల్లి మహదేవ, రవిశంకర్ మాట్లాడారు. లారీలు లేక ధాన్యం వెళ్లడం లేదని, ముక్క పేరుతో మిల్లర్లు భారీగా కోతలు పెడుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపుతూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. చిరిగిన సంచులు ఇస్తున్నారని వాటిని చూపించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తే రైతులకు ఇన్నీ కష్టాలు ఉండేవి కావన్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ధాన్యం సేకరించాలని, 20 రోజులు ఆలస్యంగా ప్రారంభించడంతో 60 శాతం ధాన్యం పొలాల్లోనే ఉందన్నారు. గోనె సంచులు కూడా ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వాన్ని ఏమనాలంటూ దుయ్యబట్టారు. టిడిపి అధికారంలో ఉంటే రైతులకు ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కేంద్రంతో పోరాడి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. గతంలో తాను శంకుస్థాపన చేసిన భోగాపురం ఎయిర్‌పోర్టుకు, అదాని డేటా సెంటర్‌కు మళ్లీ శంకుస్థాపన చేయడమేంటని విమర్శించారు.


రైతుభరోసా కేంద్రాలు దగా కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. 60 బస్తాల్లో 53 కొనడం, 12 ఎకరాలకు మించి సాగుచేస్తే ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బస్తాకు రూ.1530 ధర లభించేలా, ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకూ టిడిపి పోరాడుతుందన్నారు.

రైతులకు న్యాయం చేస్తారా.. రాజీనామా చేస్తారా?

సిఎం, వ్యవసాయశాఖ మంత్రి, ఎమ్మెల్యేలు బాధ్యతగా వ్యవహరించడం లేదని, వెంటనే రాజీనామాలు చేయాలని చంద్రబాబు ధ్వజమెత్తారు. రైతులకు న్యాయం చేయండి, లేకపోతే రాజీనామాలు చేయిండంటూ సవాల్ విసిరారు. పిల్లలకు ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేసిన మహిళా రైతు ప్రభావతికి రూ.2.30 లక్షల నగదు చెక్కును అక్కడే ఆమెకు చంద్రబాబు అందించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న రైతులపై కేసులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్ని వీరాంజనేయులు, నిమ్మల రామానాయుడు, తోట సీతారామలక్ష్మి, మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మెస్ ఛార్జీల పెంపు

- విద్యార్థుల ఆందోళన


ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

మెస్, హాస్టల్ ఫీజుల పెంపు నిరసిస్తూ రాజధాని ప్రాంతమైన నీరుకొండలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. మెస్, హాస్టల్ ఫీజులు రూ.10 వేలు పెంచడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 300 మంది వరకు విద్యార్థులు వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్దకు చేరుకుని అక్కడే బైఠాయించారు. వర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు కొత్తగా సౌకర్యాలేమీ కల్పించకుండానే ఇంత ఫీజు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. ఇప్పటికే అధికంగా ఫీజులు తీసుకుంటున్నా సరైన సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. ఇదే వర్సిటీలో రెండు రోజుల కిందట భోజనంలో పురుగులు, గుండు పిన్నులు రావడంతో విద్యార్థులు ఆందోళన చేశారు. తాజాగా ఫీజుల పెంపుపై విద్యార్థులు మరోసారి ఆందోళనకు దిగారు. స్పందించిన వర్సిటీ అధికారులు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'భోగాపురం'ను అడ్డుకుంటానని శంకుస్థాపన చేస్తారా?

- టిడిపి మహిళా అధ్యక్షులు అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తే కోర్టుకు వెళ్లి ఆపుతానని ప్రతిపక్ష నేతగా జగన్ ప్రగల్భాలు పలికారని టిడిపి మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత అన్నారు. ఇప్పుడు సిఎం హోదాలో దానికే శంకుస్థాపన చేసి మహిహారం, మకుటం అని మాట్లాడారని విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లలో ఏనాడూ గుర్తుకురాని విమానాశ్రయం ఇప్పుడే ఎందుకు గుర్తుకొచ్చిందని ప్రశ్నించారు. త్వరలోనే విశాఖకు వెళ్తానన్న జగన్ అక్కడి ప్రజలు నిలదీస్తారన్న భయంతో హడావుడిగా మరలా శంకుస్థాపన చేశారని విమర్శించారు. చంద్రబాబు 2019 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసిన విమానాశ్రయాన్ని నాలుగేళ్లలో నిర్మించలేదని, ఇప్పుడు మూడేళ్లలో నిర్మించేసి డబుల్ డెక్కర్ సర్వీసులు నడిపిస్తారా? అని విమర్శించారు.

మరో 750 ఎంబిబిఎస్ సీట్లు

- మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్/కర్నూలు హాస్పిటల్

ఈ ఏడాది రాష్ట్రానికి నూతనంగా 750 ఎంబిబిఎస్ సీట్లు వస్తాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. నంద్యాల, కర్నూలులో గురువారం ఆమె పర్యటించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి నంద్యాలలో మెడికల్ కాలేజి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాల కళాశాల పనులు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ కళాశాలలో ఈ ఏడాది 150 మంది ఎంబిబిఎస్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా జాతీయ వైద్య విధాన మండలి అనుమతి మంజూరు చేసిందన్నారు. 17 వైద్య కళాశాలల్లో ఐదు కళాశాలలను ప్రాధాన్యతగా తీసుకుని నిర్మాణ పనులను వేగంగా సాగిస్తున్నామని, ఇప్పటికే మూడు కళాశాలలకు జాతీయ వైద్య విధాన మండలి అనుమతులు వచ్చాయని చెప్పారు. అనంతరం కర్నూలు సర్వజన వైద్యశాలలో రూ.12.90 కోట్లతో నిర్మించిన డయాగ్నొస్టిక్ బ్లాక్‌ను, రూ.4.50 కోట్లతో నిర్మించిన మహిళా పీజీ హాస్టల్ భవనాలను ప్రారంభించారు. ఎంపి సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గుండె చప్పుడు వినిపిస్తాం

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల గుండె చప్పుడును ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులకు ఈ నెల 12 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తామని, ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ వలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో 175 మంది ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపిలను కలిసి తమ ఆవేదనను తెలియజేస్తామన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులను ప్రభుత్వం వేధింపులకు గురిచేయడాన్ని విడనాడాలని, అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, సస్పెన్షన్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు 'స్పందన' కార్యక్రమంలో వినతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉద్యమంలో భాగంగా ఈ నెల 9న శ్రీకాకుళంలో, 17న అనంతపురం, 27న ఏలూరులో, జూన్ 8న గుంటూరులో ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షన్లు, జీతాలు ఎందుకు ప్రభుత్వం చెల్లించలేకపోతుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎపి, తెలంగాణలో చెరో 4 ఫుడ్ స్ట్రీట్లు అభివృద్ధి

- కేంద్ర వైద్యార్యోశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చెరో నాలుగు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఫుడ్ స్ట్రీట్‌లను అభివృద్ధి చేస్తామని కేంద్ర వైద్యారోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు. దేశవ్యాప్తంగా వంద స్ట్రీట్‌లను అభివృద్ధి చేసేందుకు ఫుడ్ స్ట్రీట్ ప్రాజెక్టుపై గురువారం ఆయన సమీక్షించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ సహకారంతో సంయుక్తంగా అమలు చేయడానికి భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) మార్గదర్శకాలు ప్రకారం ఒక్కో ఫుడ్ స్ట్రీట్‌కు రూ.కోటి ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద 60:40, 90:40 నిష్పత్తిలో నిధులు విడుదల అవుతాయని పేర్కొన్నారు. ఫుడ్ స్ట్రీట్ ప్రాజెక్టులో పైలెట్ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా వంద ఫుడ్ స్ట్రీట్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఆహార వ్యాపారాలు, కమ్యూనిటీ సభ్యుల మధ్య సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని అన్నారు. సురక్షితమైన తాగునీరు, చేతులు కడుక్కోవడం, మరుగుదొడ్ల సౌకర్యాలు, సాధారణ ప్రాంతాల్లో టైల్డ్ ఫ్లోరింగ్, తగిన ద్రవ, ఘన వ్యర్థాల తొలగింపు, డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, బిల్ బోర్డులను ఉపయోగించడం వంటి కార్యకలాపాలకు ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. సాంకేతిక సహాయంలో ఫుడ్ స్ట్రీట్ రూపకల్పన చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వంద ఫుడ్ స్ట్రీట్‌లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమాక్షా సమావేశంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి కార్యాచరణ

మహిళలతో ముఖాముఖిలో లోకేష్


కర్నూలు జిల్లా బస్తిపాడు సమీపంలో ఏర్పాటు చేసిన మహిళలతో ముఖాముఖి మాట్లాడుతున్న నారాలోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే మహిళల స్వయం ఉపాధికి కార్యాచరణ రూపొందిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలంలో సాగింది. రేమడూరు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, చినకొట్టాల మీదుగా పెదకొట్టాలకు చేరుకుంది. వాల్మీకి బోయలు, ఎస్సీలు, ఆయా గ్రామాల ప్రజలు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. బొల్లవరం శివార్లలో మహిళలతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చాక మహిళల రక్షణకు చట్టాలు మాత్రమే కాదని, మహిళల్ని గౌరవించడం చిన్నప్పటి నుండే నేర్పిస్తామని తెలిపారు. మహిళల గొప్పతనం, వారి కష్టం అందరికీ తెలిసేలా కేజీ నుండి పీజీ వరకూ ప్రత్యేక పాఠ్యాంశాలు తీసుకొస్తామన్నారు. దిశ చట్టం పెద్ద మోసమని, అసలు చట్టమే లేకుండా స్టేషన్లు ప్రారంభించారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్రోల్, డీజిల్ పై పన్ను తగ్గించి ధరలు తగ్గేలా చేస్తామని, నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అన్ని రంగాల్లో మహిళల్ని ప్రోత్సహించే విధంగా చేస్తామని, సబ్సిడీ రుణాలు అందజేసి మహిళా పారిశ్రామిక వేత్తలుగా మారేందుకు సహకరిస్తామని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. పింఛన్ ఎత్తేశారని ఓ మహిళ చెప్పగా మీ ఒక్కరిదే కాదన్నా రాష్ట్రంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని, మేము అధికారంలోకి వస్తే అన్ని పునరిద్ధరిస్తామన్నారు. బుడగ జంగాలకు సర్టిఫికెట్ ఇవ్వడం లేదని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ గతంలో మేము జెసి శర్మ కమిటీ వేశాం. జెసి శర్మ నివేదికను అమలు చేసి అందరికీ ఎస్‌సి సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. పాలిచ్చే అవును కాదని తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని అందుకే మహిళలు, అన్ని వర్గాల ప్రజలు కష్టాల్లో ఉన్నారని చెప్పారు. తాను పరదాలు కట్టుకుని పాదయాత్ర చేయను అందరి ముందు ధైర్యంగా తిరుగుతున్నా.. టిడిపి అధికారంలోకి రావడం ఖాయం మహిళల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. బొల్లవరం శివారులో చంటిబిడ్డను కాడిమధ్య ఉయ్యాలలో వేసి, సేద్యం చేస్తున్న రైతును లోకేష్ కలిశారు. లోకేష్ అరక దున్నుతూ రైతన్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చట్టం తెస్తామని, పంట పెట్టుబడులను తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తామని, పాత క్రాప్ ఇన్సూరెన్స్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. గురువారం 11.9 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, పాణ్యం నియోజకవర్గ ఇంఛార్జి గౌరు చరితారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు గుడిసె కృష్ణమ్మ, నంద్యాల పార్లమెంటు మహిళా విభాగం అధ్యక్షులు పార్వతమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న మంత్రులు

- టిడిపి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ రాష్ట్రాన్ని హోల్‌సేల్‌గా దోచుకుంటుంటే, మంత్రులు ఆలీబాబా 40 దొంగల మాదిరి లూటీ చేస్తున్నారని టిడిపి బిసి ఫెడరేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. పదవులు, దోపిడీ కోసం బిసి మంత్రులు జగన్‌కు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. బిసిలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. బిసిలు ఎప్పుడూ టిడిపితోనే ఉన్నారని ఆ పార్టీ నాయకులు నాగుల్‌మీరా అన్నారు. బిసి ఫెడరేషన్ సోషల్‌మీడియా కో ఆర్డినేటర్ గంజాం రాఘవేంద్ర, కోనేరు సురేష్, నాయకులు ఎస్‌పి సాహెబ్, సుభాన్ సాహెబ్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

అవినాష్‌రెడ్డి అరెస్టును అడ్డుకుంటున్న జగన్ : వర్ల

వివేకానందరెడ్డి హత్యకేసులో కుట్రదారుడు, అసలు నిందితుడు అవినాష్‌రెడ్డి అరెస్టును సిఎం జగన్ సిబిఐ నుంచి అడ్డుకుంటున్నారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడంలో సిబిఐ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని ప్రశ్నించారు.

లాబీయిస్ట్ విజయ్‌కుమార్ ముఖ్యమంత్రి కార్యాలయంలోని సెక్రటరీతో ఏం మాట్లాడుతున్నారో కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వ్యవస్థలు కనిపెట్టాలన్నారు. సిట్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై ప్రభుత్వం కక్షసాధించాలని చూస్తోందన్నారు.

చంద్రబాబువి ఉత్తుత్తి శంకుస్థాపనలు

- మంత్రి బొత్స సత్యనారాయణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు భోగాపురం ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే కేవలం ఉత్తుత్తి శంకుస్థాపన చేసిన చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 12 వేల ఎకరాలు భూసేకరణ చేసి విమానాశ్రయం కట్టాలనుకున్న నిర్ణయాన్నే తాము వ్యతిరేకించామని అన్నారు. అన్ని వేల ఎకరాలు అంటే ఒక మండలాన్నే మాయం చేయాలనుకున్నారని విమర్శించారు. అంత అవసరం లేదని ఆ రోజు జగన్ చెప్పారు కాబట్టే అధికారంలోకి వచ్చాక భూసేకరణను తగ్గించి 2,300 ఎకరాల్లోనే చేశామని అన్నారు. రైతులను సంతృప్తి చేశాకే శంకుస్థాపన చేశామన్నారు. ఒకరిద్దరికి మినహా రైతులందరికీ నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు.

విభజన చట్టంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి ఉందని అన్నారు. జరిగిన తప్పులను ప్రజలకు వివరించడానికే రాజధానిలో అక్రమాలపై సిట్ విచారణ జరుగుతోందన్నారు. చంద్రబాబుపై ఆరోపణలు వస్తే ఎందుకు నిజాయతీని నిరూపించుకోరని ప్రశ్నించారు.



ప్రభుత్వ బ్యాంక్‌లకు ఐదే పని దినాలు..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు వారంలో ఐదు పని దినాలకు పరిమితం కానున్నాయి. దీనికి త్వరలోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలుపనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐదు రోజుల పని అమలు కోసం ఎప్పటి నుంచో బ్యాంక్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఇటీవల ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ), యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (యుఎఫ్‌బిఇ) మధ్య సూత్రప్రాయ అంగీకారం కుదిరింది. అయితే రోజుకు 40 నిమిషాలు పని వేళలు పెరగనున్నాయి. ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందని సమాచారం. ప్రస్తుతం రెండు, నాలుగవ శనివారాలో బ్యాంక్‌లకు సెలవు ఉంటుంది. నాలుగు రోజుల పని దినాలకు ఆర్థిక శాఖ ఆమోదం లభించగానే అన్ని శనివారాలు బ్యాంక్‌లు మూత పడనున్నాయి.

కాగ్నిజెంట్‌లో 3,500 మందిపై వేటు



న్యూఢిల్లీ: ఐటి కంపెనీలు భారీ లాభాలను సాధిస్తున్నప్పటికీ మార్జిన్లను మరింత పెంచుకోవడానికి ఉద్యోగులకు ఉద్వాసనలు పలుకుతున్నాయి. తాజాగా దిగ్గజ ఐటి కంపెనీ కాగ్నిజెంట్ 3500 మంది ఉద్యోగులపై వేటు వేయడానికి సిద్ధం అయ్యింది. ఇది అమెరికన్ కంపెనీ అయినప్పటికీ భారత్‌లోనే ఎక్కువ కార్యకలాపాలను కలిగి ఉండటం విశేషం. వ్యయాలను తగ్గించుకోవడానికి వీలుగా సిబ్బందికి పింక్ స్లిప్స్‌ను జారీ చేయనున్నటుగా ఆ సంస్థ సిఇఓ ఎస్ రవి కుమార్ తెలిపారు. అదే విధంగా 1.1 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలాలను కూడా వదులుకోనున్నామన్నారు. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ కంపెనీ లాభాలు 11 శాతం పెరిగాయి. ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో 3.50 లక్షల పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో రెండు లక్షల మంది భారత్‌లోనే ఉన్నారు.



సామ్‌సంగ్ నుంచి కొత్త నియో క్యూఎల్ఇడి టివిలు

గూర్‌గావ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కొత్తగా 2023 నియో క్యూఎల్ఇడి టివిలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. అత్యాధునిక ఐఓటి హబ్‌తో వస్తోన్న ఈ 8కె టివిలు 50 అంగుళాల నుంచి 98 అంగుళాల పరిమాణంలో లభిస్తాయని తెలిపింది. వీటి ధరలను రూ.1,41,990 నుంచి రూ.3,14,000 వరకు నిర్ణయించింది. మే 25లోపు కొనుగోలు చేసే వినియోగదారులకు రూ.99,990 విలువ చేసే సామ్‌సంగ్ సౌండ్‌బార్‌ను ఉచితంగా ఇస్తోన్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

రాష్ట్ర మార్కెట్లోకి మోంట్రా ఇవి ఆటోలు



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మురుగప్ప గ్రూపులో భాగమైన మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్కెట్లోకి తన తిచక్ర వాహనాలను విడుదల చేసినట్లు ప్రకటించింది. సింగిల్ చార్జింగ్‌తో 197 కిలోమీటర్ల మేర ప్రయాణించే ఇవి ఆటోలను విజయవాడ, అనంతపురం, కడప తదితర ప్రాంతాల్లో టెస్ట్ రైడ్‌ల కోసం అందుబాటులోకి తెచ్చామని ఆ కంపెనీ ఎండి కెకె పాల్ తెలిపారు. సబ్సీడీ తర్వాత ఎక్స్‌షోరూం వద్ద వీటి ధరలను రూ.3.02 లక్షల నుంచి రూ.3.45 లక్షలుగా నిర్ణయించామన్నారు. ఇవి గంటకు గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలవన్నారు. తెలంగాణలోనూ ఖమ్మం, మంచిర్యాలలో అందుబాటులో ఉంటాయని ఆ కంపెనీ తెలిపింది.

సంపాదకీయం


చిత్తశుద్ధి ఏదీ...?

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ట్రేడ్‌యూనియన్లు, ప్రజాసంఘాలు బుధవారం చేపట్టిన ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం తగదు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడం, రోడ్లపై ఆందోళనకు యత్నించినవారిని అరెస్టు చేయడమేగాక అసలు రాస్తారోకోలనే జరగనీయకుండా పోలీసులు ప్రయత్నించడం దారుణం. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని నినదించి, 32 మంది యువ కిశోరాల ప్రాణత్యాగంతో తెలుగువారు సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్‌పరం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బిజెపి తప్ప రాష్ట్రంలోని అన్ని పార్టీలూ వ్యతిరేకించాయి. ప్రయివేటీకరణ ప్రతిపాదనను కేంద్రం విరమించుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్టీల్‌ప్లాంట్ కార్మికులు గత 800 రోజులకుపైగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. ట్రేడ్‌యూనియన్లు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు సాగుతున్నాయి. వాటిలో భాగంగానే మే 3న రాస్తా రోకోలకు విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుపున్చింది. ఆ వేదికలో వైఎస్‌ఆర్‌టియు భాగస్వామి కూడా! ఈ వేదిక నిర్వహించిన వివిధ ఆందోళనలకు వామపక్షాలతోపాటు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కూడా మద్దతునిస్తున్నాయి. సంఘీభావం తెలుపుతూనే వచ్చాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం నిరసనలపై నిర్బంధం ప్రయోగించడంతో దాని చిత్తశుద్ధిని శంకించవలసి వస్తోంది. వైసిపి సర్కారు వైఖరి 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించిన' చందంగా ఉంది. ఉత్తరాంధ్రలో ట్రేడ్ యూనియన్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను ఎక్కడికక్కడ ఎందుకు గృహ నిర్బంధం చేస్తున్నారని అడిగితే ముఖ్యమంత్రి పర్యటన సాకుగా చెప్పిన పోలీసులు రాష్ట్రమంతటా ఏ పర్యటనలున్నాయని అరెస్టులు చేశారో!

రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మకుటాయమానమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సాగుతున్న ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వమే నాయకత్వం వహించి ముందుకు నడపాల్సిందిపోయి ఆందోళనకారులపై నిర్బంధానికి పూనుకోవడం సబబు కాదు. కొత్తగా పెట్టుబడులు తెస్తాం... పరిశ్రమలు వస్తున్నాయని హోరెత్తించే నేతలు ఉన్న భారీ పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించేందుకు కృషి చెయ్యకపోతే ఎలా? స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న వారిపై వైసిపి సర్కారు నిర్బంధం ప్రయోగించడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుయుక్తులకు వత్తాసు పలకడంగానే ప్రజలు భావించక తప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజాసంఘాలు ఆందోళన చేస్తుంటే, అదానీ పంపిన ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు వెళ్లారన్న వార్తతో సర్కారు ప్రతిష్ట ప్రజల్లో మరింత పలచబడింది. ప్రయివేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత ఉక్కు గనులు కేటాయించిన కేంద్రం... ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించడంలేదు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విదితమవుతోంది. రాష్ట్ర ప్రజల ఆందోళన, ఆగ్రహం గమనించి అయినా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడేందుకు కలిసి రావడం విజ్ఞతగా ఉంటుంది.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేట్‌పరం కానివ్వరాదు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి రాష్ట్రంలోని కార్మిక వర్గం, ప్రజానీకం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలి. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో స్టీల్ ప్లాంట్ వద్ద సుదీర్ఘ కాలంగా కార్మికులు దీక్ష సాగించడం అభినందనీయం. విశాల శక్తుల సంఘీభావంతో అది మరింత ముందుకు సాగించాలి. ఉక్కు సాధనకు ఉద్యమం సాగించిన రీతిలోనే దాని పరిరక్షణకు మహోద్యమం సాగించడమే మన ముందున్న ఏకైక మార్గం. అలా మాత్రమే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడం సాధ్యమవుతుంది.

మంచిమాట



పరిశీలించకుండా ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించవద్దు. మత గ్రంథంలో రాసి ఉందని గానీ, ఓ పెద్ద గురువు చెప్పాడని గానీ, తాతముత్తాతల నుండి పాటిస్తున్నారని గానీ, సంప్రదాయంగా వస్తూ ఉందని గానీ, ఎక్కువ మంది పాటిస్తున్నారని గానీ లేక నీ అంతట నీవే ఊహించుకుని గానీ - దేనినీ గుడ్డిగా విశ్వసించవద్దు! దానిని ఓ 'అనుభవం' అనే గీటు రాయిపై పరీక్షించి చూడు. అది సర్వజనులకు హితాన్ని, సుఖాన్ని కలిగిస్తుందో లేదో పరిశీలించు. తగు యోగ్యమైనదని తేలితేనే స్వీకరించు - లేకపోతే అవతల పెట్టు.

- గౌతమ బుద్ధుడు

నివాళి

ఆర్థిక సంక్షోభాల గుట్టు విప్పిన కారల్ మార్క్సు

వి. రాంభూపాల్

ప్రపంచ ఆర్థిక మాంద్యం అన్ని దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ మాంద్యం మరింత తీవ్రమై ఈ అక్టోబర్ నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా మారుతుందని అనేక మంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. 'ప్రపంచ దేశాలు ఈ ఆర్థిక మందగమనాన్ని తప్పించుకోలేవు' అని స్వయంగా ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మల్పాస్ వాఖ్యానించాల్సి వచ్చింది. 80 సంవత్సరాల తర్వాత ఒకే దశాబ్దంలో రెండు ప్రపంచ మాంద్యాలు సంభవించడం ఇదే ప్రథమం అవుతుంది. మూడు దశాబ్దాల కాలంలో ప్రపంచ ఆర్థికాభివృద్ధి మూడోసారి అత్యంత అథమ స్థాయికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. 107 దేశాల్లో 69 దేశాలు ఆహారం, ఇంధన ధరలు, ఆర్థిక కష్టాలను తీవ్రంగా ఎదుర్కొంటాయని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఉద్యోగులు తొలగించబడుతున్నారు. చిన్న, మధ్యతరహా కంపెనీలు మూతపడుతున్నాయి. ఇంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ప్రపంచం ఎందుకు పదేపదే ఎదుర్కొంటున్నది? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే...సంక్షోభాలకు కారల్ మార్క్సు చెప్పిన కారణాలను పరిశీలించాల్సిందే.

కారల్ మార్క్సు జర్మనీ లోని ట్రియర్‌లో 1818 మే 5న జన్మించాడు. మార్క్సు యుక్తవయసుకు వచ్చే నాటికి యూరప్‌లో పారిశ్రామిక విప్లవం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ ఖండఖండాంతరాలకు విస్తరిస్తున్నది. రాజరిక పాలన స్థానంలో బూర్జువా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నది. ఆయన ఈ దశలో నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలను పరిశీలించనారంభించాడు. విద్యార్థిగా, న్యాయవాదిగా, జర్నలిస్టుగా, తత్వవేత్తగా, ఆర్థికవేత్తగా, చరిత్రకారుడిగా అన్నిటినీ మించి మహా మనిషిగా, విశ్వనరుడిగా మానవ సమాజ పురోగతికి అనన్య సామాన్యమైన కృషి చేశాడు కారల్ మార్క్సు. పెట్టుబడిదారీ వ్యవస్థ ధగధగ వెలుగుల ముందు అందరూ సాగిలపడుతుంటే...మార్క్సు మాత్రం పెట్టుబడి పొట్ట విప్పి అందులోని కుళ్ళును, దోచుకున్న రక్తమాంసాలను, దోపిడి విధానాన్ని, అమానవీయతను, దాన్ని అంతం చేయాల్సిన అవసరాన్ని కార్మిక జనానికి చెప్పేందుకు తన యావజ్జీవితాన్ని త్యాగం చేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అనివార్యంగా వచ్చే ఆర్థిక సంక్షోభాల మూలాలను, వాటిని పరిష్కరించే విధానాన్ని అత్యంత శాస్త్రీయంగా వివరించాడు.

నేడు మార్క్సు 205వ జయంతి. ప్రపంచమంతా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నది. అనేకమంది సంక్షోభాన్ని దాని ప్రభావాలను విశ్లేషిస్తున్నారు. మార్క్సు చెప్పినట్లు 'అనేకమంది తత్వవేత్తలు ప్రపంచాన్ని పలు రకాలుగా విశ్లేషించారు, ఇప్పుడు ఆ ప్రపంచాన్ని మార్చాలి, అందుకు ప్రపంచ కార్మికులారా ఏకం కండి, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప'.

ప్రస్తుత సంక్షోభం తీవ్రత


2022 ప్రారంభంలో ప్రపంచ ఆర్థిక పురోగతి రేటు 6.1 శాతం ఉంటుందన్న అంచనా, అదే సంవత్సరం జూన్ నాటికి 3.0 శాతం, ఇప్పుడు 1.7 శాతానికి మించదని చెబుతున్నారు. ఐఎంఎఫ్ ప్రకటించిన '2023 నవంబర్ ప్రపంచ ఆర్థిక దృష్టి' ప్రకారం 2023లో 3.4 శాతం నుండి 2.8 శాతానికి పడిపోయిందంటూనే 2024 నాటికి 3 శాతం వుంటుందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వృద్ధి నేలకు అతుక్కుపోతున్నట్లుగా 2023లో 2.7 శాతం నుండి 1.3 శాతానికి పడిపోయింది. అమెరికా 0.2, బ్రిటన్ 0.3, ఫ్రాన్స్ 0.7 శాతానికి పరిమితం కావచ్చని, ఐరోపా యూనియన్ వృద్ధి ఈ సంవత్సరం 0 శాతంగా ఉంటుందని అంచనా. వర్ధమాన దేశాలన్నింటి వృద్ధి 2022లో 3.8 శాతం ఉండగా, 2023లో 2.7 శాతం వుంటుందని అంచనా.

ఈ కాలంలో అమెరికా లోని ముఖ్యమైన రెండు పెద్ద బ్యాంకులు సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ కుప్పకూలాయి. ప్రఖ్యాత క్రెడిట్ సూయిస్ కూడా దాని ఈక్విటీ ధరల పతనాన్ని ఎదుర్కొంటున్నది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని నివారించేందుకోసమని ఫెడరల్ రిజర్వు బ్యాంకు వడ్డీరేట్లను భారీగా పెంచింది. 2022 ఫిబ్రవరి నాటికి అమెరికా వడ్డీరేటు 0.25 వుండగా, 2023 ఫిబ్రవరి నాటికి 4.75 శాతానికి పెంచింది. ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్ల పెంపుతో 90 దేశాల కరెన్సీ విలువలు పతనమయ్యాయి.

మన దేశంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అబద్ధాలనే పునాదిగా కలిగి వుంది. ఆర్థిక విషయాల్లో కూడా అబద్ధాల అంకెలనే ప్రచారం చేసుకుంటున్నది. ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా బాకా ఊదుకుంటున్నప్పటికి వాస్తవంగా సగటు తలసరి ఆదాయంలో అంగోలా, ఐవరి కోస్ట్ దేశాల కంటే వెనుక వున్నాం.

నిరుద్యోగం- అసమానతలు

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) 2023 జనవరి 14న ప్రకటించిన 'ప్రపంచ ఉపాధి, సామాజిక అంచనాల'



నేడు మార్క్సు 205వ జయంతి

నివేదిక ప్రకారం ఈ సంవత్సరం 5.2 కోట్ల పూర్తికాలం ఉద్యోగాలకు సమానమైన పని గంటలు తగ్గిపోతాయని పేర్కొంది. సర్వీసు రంగం ముఖ్యంగా ఐటి రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగుల వేతనాల కుదింపు, తొలగింపు, కొత్త ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ నిలిపివేత జరుగుతున్నాయి. గత 60 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా ఆహార ధరలు 2022లో పెరిగినట్లు ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (డబ్ల్యుఎఫ్‌ఎఒ) తెలిపింది. పొరుగున వున్న పాకిస్తాన్‌లో ఈ సంవత్సరం 40 శాతానికి పైగా ద్రవ్యోల్బణం పెరిగింది. ఒకవైపు పెరిగిన ద్రవ్యోల్బణం వల్ల కార్మికుల నిజ వేతనాలు ప్రపంచంలో 33,700 కోట్ల డాలర్ల మేర తగ్గిపోయాయి. మరోవైపు 2020 తరువాత 42 లక్షల కోట్ల డాలర్ల కొత్త సంపద సృష్టించబడితే దానిలో మూడొంతులు పై స్థాయిలోని ఒక్క శాతం ధనికుల జేబుల్లోకి వెళ్లింది. ప్రపంచ శత కోటీశ్వరుల సంపద సగటున ప్రతి రోజు 270 కోట్ల డాలర్ల చొప్పున పెరిగిపోయింది.

ఆర్థిక సంక్షోభం అంటే ?

సులభంగా చెప్పాలంటే వరుసగా రెండు త్రైమాసికాలు (ఆరు నెలలు) గనుక స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు తిరోగమనంలో సాగితే ఆ దేశం మాంద్యంలోకి వెళ్లినట్లు పరిగణిస్తారు. మాంద్యం పెరిగి ఆర్థిక పునరుత్పత్తిలో తీవ్రమైన నిలుపుదల ఏర్పడితే ఆర్థిక సంక్షోభం అంటారు. ఇటీవల పత్రికల్లో, టీవీల్లో వస్తున్న ధరల పెరుగుదల, పరిశ్రమల మూత, వేల సంఖ్యలో ఐ.టి ఉద్యోగుల తొలగింపు, పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం వార్తలు, విశ్లేషణలు ఇంతవరకు ప్రపంచీకరణ అందమైనదని, అద్భుతమైనదని, సమాజ పురోగమనంలో ఇదే చివరిదనీ ఊదరగొట్టిన దానికి భిన్నంగా 'అందమైన లోకమని రంగురంగు లుంటాయని... అందరూ అంటుంటారు...అది అంత అందమైనది కానే కాదు చెల్లెమ్మా' అన్నట్లుగా తయారైంది. 185 సంవత్సరాల క్రితం మార్క్సు చెప్పినట్లు 'పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సామాజికం, యాజమాన్యం వ్యక్తిగతం'. ఇదే ఈ వ్యవస్థలోని సర్వ సమస్యలకు మూలం. సమిష్టి కృషి వల్ల సృష్టించబడిన విజ్ఞానం, పరికరాలు, ప్రకృతి వనరుల మీద కొందరు ధరాధిపతులై, చివరకు శ్రమను కూడా సరుకుగా మార్చేశారు.

ఆర్థిక సంక్షోభాలు ఎందుకు వస్తాయి?

పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి, పంపిణీ, వినిమయం గురించి విశ్లేషించే క్రమంలో కారల్ మార్క్సు మాంద్యం గురించి సూత్రీకరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ జీవకణం సరుకుల ఉత్పత్తి. ఉపయోగపు విలువ (మనిషి ఏదో ఒక అవసరాన్ని తీర్చే గుణం)తో పాటు, మారకపు విలువ వుండేదే అమ్మబడుతుంది, కొనబడుతుంది. సరుకుకు మారకపు విలువ ఆ సరుకులో వున్న శ్రమ నుండే వస్తుంది. అందుకే సరుకులు అమ్మబడడం లేదా కొనబడడం జరుగుతుందంటే ఆ సరుకులోని శ్రమ అమ్మబడుతుంది లేదా కొనబడుతుంది అని అర్థం. సమస్త సరుకులు శ్రమ జనితాలే. సరుకు అమ్మడంలో వచ్చే లాభాలే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రాణం. లాభం కోసమే ఉత్పత్తి, లాభం కోసమే అమ్మకం. లాభం లేకపోతే ఎలా మరీ. అని అమాయకంగా ఈ వ్యవస్థను బలపరచే వారు అంటారు. నిజమే కాని...ఆ లాభం ఎక్కడిదో చెప్పమంటాడు మార్క్సు. వారు నిజం చెప్పరు, చెప్పలేరు. ఒకవేళ చెబితే డిమాండ్, సప్లయ్ అనో, తక్కువ కొని ఎక్కువకు అమ్మడమనో, ముందే ధర నిర్ణయించుకోవడమనో కాకమ్మ కథలు చెబుతారు.

లాభం ఎక్కడి నుండి ఎలా వస్తుంది, అది ఎలా పెరుగుతుంది, చివరకు ఆ లాభమే ఈ వ్యవస్థ పతనానికి ఎలా కారణమవుతుందో మార్క్సు కులంకుషంగా వివరించాడు. లాభం ఉత్పత్తి క్రమంలో ఏర్పడి, మార్కెట్‌లో చేతికి వస్తుందన్నాడు. పెట్టుబడిదారుడు మార్కెట్‌లో భూమి, యంత్రాలు, ముడి పదార్థాలను కొంటాడు. వాటి నిజమైన ధరకే మరో పెట్టుబడిదారుడు ఉత్పత్తి చేసే పెట్టుబడిదారునికి అమ్ముతాడు. వీటితోపాటు మార్కెట్‌లో మరో ప్రత్యేక లక్షణమున్న సరుకును కొంటాడు. అదే శ్రమ. వ్యవస్థ సృష్టించిన లేబర్ మార్కెట్ లోని రిజర్వు సైన్యం నుండి వీలైనంత చౌకగా ఈ శ్రమ అనే సరుకును కొంటాడు. కార్మికులకు ఇచ్చే వేతనాల కంటే అదనంగా పని చేయించుకోవడం ద్వారా అదనపు విలువ లేదా లాభం పొందుతాడు.

లాభం మరింతగా పెంచుకోవడం కోసం అధునాతన యంత్రాలను ఫ్యాక్టరీలో ప్రవేశపెట్టి, కార్మికుల పని వేగం పెంచి తక్కువ మంది కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ లాభాన్ని పొందుతాడు. పని గంటలను పెంచడం, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, పీస్ రేటు, వర్క్ ఫ్రమ్ హోమ్ ఇలా అనేక రకాల మార్గాల ద్వారా అధికోత్పత్తిని పెంచుతారు. దీనివల్ల కార్మికుల తొలగింపు, చిన్న పరిశ్రమల మూత పెరుగుతాయి. అప్పటికే వున్న నిరుద్యోగులకు ఉపాధి కోల్పోయిన వారు తోడవుతారు. వీరందరి కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. మిగిలిన ఆ కొద్దిపాటి కొనుగోలు శక్తిని తామే ఆక్రమించుకుని, తమ సరుకులు మాత్రమే అమ్ముకునేందుకు దేశీయ, విదేశీ పెద్ద పెట్టుబడిదారులు తమలో తాము పోటీ పడి వినియోగదారులను ఆకర్షిస్తారు. ఈ పోటీకి నిలబడలేని మధ్యతరహా కంపెనీలు మరింతగా మూతపడడం లేదా విలీనం చేయడం జరుగుతుంది. అదనపు నిరుద్యోగులు మరింతగా పెరిగి వారి కొనుగోలు శక్తి మరింతగా క్షీణిస్తుంది. ఇది సంక్షోభాన్ని తీవ్రం చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థికాభివృద్ధి రంగం మందగించడమే కాదు, సరుకుల ఉత్పత్తే సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. తన గొయ్యిని తానే తవ్వుకుంటాడు. ఆ గోతిలో (తనే సృష్టించుకున్న కార్మిక వర్గ పోరాటాల్లో) ఈ వ్యవస్థ అంతం అవుతుందన్నాడు మార్క్సు.

ప్రపంచీకరణ విధానాల వల్ల సంక్షోభం కూడా ప్రపంచ వ్యాప్తమైంది. సంక్షోభానికి శాశ్వత పరిష్కారం పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు వ్యవస్థను నిర్మించడం. అందుకోసం కారల్ మార్క్సు రచనలను విస్తృతంగా అధ్యయనం చేయాలి, నూతన సమాజ నిర్మాణానికి ఆచరణలో కృషి చేయాలి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు/

★

విశ్లేషణ

పి.ఎ.సి.ఎస్ ల ప్రైవేటీకరణతో ఎవరికి మేలు?



పి.అజయ కుమార్

> **ఈ సమస్య కేవలం రైతులు, ఉద్యోగులకు చెందినదిగా చూడకూడదు. ఇది రైతుల ఆధ్వర్యంలోని పిఎసిఎస్‌ల పరిధిని కూడా దాటిపోతోంది. ఇది గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులకు దారితీస్తుంది. దీనంతటికీ అసలు మూలం పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణలోనే ఉంది. మోడీ మనసును ముందే కనిపెట్టి తదనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మోడీ ప్రభుత్వం నుండి ఆదేశం వచ్చీరాగానే అది ఇక్కడి ప్రభుత్వ జీవో రూపంలో బయటకు వస్తోంది.**

రాష్ట్ర వైసిపి ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం-1964'కు 2022 సెప్టెంబర్‌లో సవరణలు చేసి చట్టసభలలో పాస్ చేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల(పి.ఎ.సి.ఎస్)లో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇచ్చింది. కనీసం రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టాలని నిబంధన పెట్టింది. 50 శాతం అంతకంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టినవారు సహజంగానే తాము పెట్టిన పెట్టుబడికి ఆదాయం రావాలని కోరుకుంటారు. ఈ సంఘాలలో పెట్టుబడులు పెట్టేవారు రూ.4 లేదా రూ.5 కోట్ల పెట్టుబడులు పెట్టాలి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో రూ. 4 లేదా 5 కోట్లు షేర్ క్యాపిటల్ కలిగిన సంఘాలు కూడా వున్నాయి. ఈ స్థాయిలో పెట్టుబడులకు ఆదాయం రావడమంటే రైతులకు ఇచ్చే సర్వీసులకు చార్జీలు, వడ్డీలు పెంచాలి. ఉద్యోగుల సంఖ్యను కూడా తగ్గించి వారి వేతనం మీద దాడి చేయాలి. అందుచేత ఈ ప్రైవేటీకరణ ప్రభావం తీవ్రంగా వుంటుంది.

రైతు భరోసా కేంద్రాలు రైతులకు మంచి సేవలు అందిస్తున్నాయని వివిధ రాష్ట్రాలు, సంస్థలతో కితాబులు ఇప్పించుకున్న వైసిపి ప్రభుత్వం ఇదే చట్ట సవరణ ద్వారా వాటిని పిఎసిఎస్ లలో విలీనం చేసింది. వృత్తి నిపుణులను, ఫైనాన్స్ బ్యాంక్ ప్రతినిధులను మేనేజింగ్ బోర్డుల లోకి ఓటింగ్ హక్కులతో ప్రవేశపెట్టింది. 50 శాతం వాటాలతో ప్రవేశించే ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు వచ్చే ఓటింగ్ హక్కులకు ఇవి అదనం. ఇప్పటి వరకు రైతుల చేతుల్లో ఉన్న వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ప్రైవేటుపరం కానున్నాయి. ఇప్పుడు వాటిని కేంద్ర మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తోంది.

ఈ పరిణామాలపై వాటాదారులుగా ఉన్న రైతులు, మేనేజ్‌మెంట్ బోర్డుల్లోని వారి ప్రతినిధులు, పిఎసిఎస్ లలో పనిచేసే ఉద్యోగులు ఆందోళనతో ఉన్నారు. దక్షిణాదిలో ఉన్న కేరళ రాష్ట్రంలో చాలా కాలం నుండి వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ప్రాథమిక వ్యవసాయ బ్యాంకుల పేరుతో రైతుల యాజమాన్యంలోనే నడుస్తున్నాయి. ఇప్పుడు మోడీ, ఆయనకు జోడీగా ఉండే జగన్ మోహన్ రెడ్డి చెప్తున్న కామన్ సర్వీస్ సెంటర్ల (సిఎస్‌సి)లో లభించే అన్ని సర్వీస్‌లు కేరళలో రైతుల యాజమాన్యంలోనే లభిస్తున్నాయి. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో సిఎస్‌సి లలో లభించే అన్ని సర్వీస్‌లు పిఎసిఎస్ లలో ఏర్పాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఈ రాష్ట్రాలలో ఎక్కడా కూడా పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణ చెయ్యలేదు. పైగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయి. వీటికి విరుద్ధంగా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రైవేటీకరణతో ముందుకు పోతోంది. చంద్రబాబు నాయుడు సహకార రంగాన్ని ధ్వంసం చేశాడని, తాము దాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం పిఎసిఎస్ లను ప్రైవేటు చేతుల్లో పెడుతోంది.

కేంద్ర మోడీ ప్రభుత్వం కూడా నిజాయితీతో వ్యవహరించకుండా సహకార రంగ ధ్వంసానికి పూనుకుంటోంది. ప్రతి గ్రామంలో పిఎసిఎస్ లను ఏర్పాటు చేస్తామని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా ప్రకటనలు చేశారు. కానీ అదే కేంద్ర ప్రభుత్వం పిఎసిఎస్ లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చమని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చింది. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా పౌరులకు కావలసిన అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తాలుకా సర్వీసులు, పథకాలు అమలవుతాయని, పౌరులకు అవసరమైన అన్ని సరుకుల వ్యాపారాలను సిఎస్‌సి లు నిర్వహిస్తాయని, 300 రకాల ఆన్‌లైన్ సర్వీస్‌లు లభిస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, వ్యవసాయం, రుణాలు, పెన్షన్లు, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ, పాన్‌కార్డులు, పాస్‌పోర్టులు తదితర సర్వీసులన్నీ అందుబాటులో ఉంటాయని ఊదరకొడుతున్నాయి.

ఈపాటికే రాష్ట్రంలో 20,069 కామన్ సర్వీస్ సెంటర్లు ప్రైవేటు వ్యక్తుల (విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రూనర్స్) ఆధ్వర్యంలో ఏర్పడ్డాయని ప్రభుత్వ సమాచారం చెపుతున్నది. వీటిలో 15,080 కేంద్రాలు గ్రామాల్లో ఏర్పడ్డాయి. వీటి పరిస్థితి ఏమిటి, అవి ఎలా నడుస్తున్నాయి? ఎన్ని సర్వీసులు అందించ గలుగుతున్నాయి? అనే సమాచారం ఎక్కడా లేదు. ప్రభుత్వం కూడా చెప్పటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తున్నారు. ప్రైవేటు పెట్టుబడుల యాజమాన్యంలోని పిఎసిఎస్ లు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారితే వాటి ప్రభావం ఇప్పటికే ఉన్న సెంటర్లపై ఎలా ఉంటుందో రాబోయే కాలంలో తెలుస్తుంది. ప్రైవేటీకరించబడే పిఎసిఎస్ లు కార్పొరేట్ పెట్టుబడుల చేతుల్లోకి పోతాయి. వాటిలో అందే సర్వీసులు రైతులు భరించే స్థాయిలో ఉంటాయని అనుకోలేము. పిఎసిఎస్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి కూడా అగమ్యగోచరం అవుతుంది. వారి వేతనాలు, పని పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉద్యోగ భద్రత గాలికి పోతుంది.

రాష్ట్రంలో 2600కు పైగా పిఎసిఎస్‌లు ఉన్నాయి. అదే సమయంలో 6000-7000 లోపు రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో సగానికి పైగా సొంత ఆఫీసులు లేవు. పిఎసిఎస్ లలో కూర్చొని పని చేసే జిల్లాలు కూడా ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలు అలంకార ప్రాయంగా నడుస్తున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేసి ప్రతి గ్రామంలోనూ రైతులకు అందుబాటులోకి తేవలసిన బాధ్యత ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వీటిని నడపలేక పిఎసిఎస్ లలో విలీనం చేస్తోంది.

పిఎసిఎస్ ల ప్రైవేటీకరణ విరమించాలని, రైతు భరోసా కేంద్రాలను విడిగా నడిపి రైతులకు అందుబాటు లోకి తెచ్చి అన్ని రకాల రైతుల అవసరాలను తీర్చేవిధంగా వాటిని అభివృద్ధి చెయ్యాలని రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. దీని కోసం ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం-1964 కు చేసిన సవరణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. రైతు సంఘాలతో, ఉద్యోగ సంఘాలతో, రైతులు వాటాదారులుగా ఉన్న పిఎసిఎస్ జనరల్ బాడీలతో చర్చించి ఆ తరువాతనే ముందుకు వెళ్ళాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు అవసరమైన ఆందోళనా కార్యక్రమాన్ని రూపొందించే పనిలో ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం 2013 తరువాత ఇంత వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మేనేజింగ్ కమిటీలకు ఎన్నికలు జరపలేదు. గతంలో టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం సహకార సంఘాలను రైతుల యాజమాన్యంలో ప్రజాతంత్రయుతంగా నడపడానికి సిద్ధపడటంలేదు. వైసిపి ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం సహకార సంఘాలను వాడుకుంటోంది. తన అనుయాయులను సహకార సంఘాల పర్సనల్ ఇన్‌చార్జీలుగా నియమించింది. వీరు తమ ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించలేరు. దీనిని అవకాశంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సంఘాలలో పనిచేస్తున్న కార్యదర్శుల ద్వారా పిఎసిఎస్ లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చేందుకు పూనుకుంది. కార్యదర్శుల, సహకార సంఘాల ఐడీ లను తీసుకొని సమావేశాలకు రమ్మంటూ జిల్లా సహకార అధికారులు తాకీదులు ఇస్తున్నారు. ఈ ప్రయత్నాలను వెంటనే విరమించి ముందుగా రైతు సంఘాలతో, ఉద్యోగ సంఘాలతో చర్చించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవటానికి సహకార సంఘాల చట్టానికి చేసిన సవరణలను వెనక్కి తీసుకోవాలి.

ఈ సమస్య కేవలం రైతులు, ఉద్యోగులకు చెందినదిగా చూడకూడదు. ఇది రైతుల ఆధ్వర్యంలోని పిఎసిఎస్‌ల పరిధిని కూడా దాటిపోతోంది. ఇది గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులకు దారితీస్తుంది. దీనంతటికీ అసలు మూలం పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణలోనే ఉంది. మోడీ మనసును ముందే కనిపెట్టి తదనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మోడీ ప్రభుత్వం నుండి ఆదేశం వచ్చీరాగానే అది ఇక్కడి ప్రభుత్వ జీవో రూపంలో బయటకు వస్తోంది.

రాష్ట్రంలో ఎవ్వరితోనూ సంప్రదించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడుల ప్రయోజనాల కోసం మోడీ అడుగుజాడల్లో జగన్ ప్రభుత్వం నడుస్తోంది. సమీప భవిష్యత్ లోనే ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడుల చేతుల్లోకి పోయే అన్ని రకాల సర్వీసులు గ్రామీణ ప్రజా జీవనంపై ప్రతికూల ప్రభావాన్ని తీసుకు వస్తాయి. ధనికులు మాత్రమే బాగుపడే పరిణామాలు వస్తాయి. దీనికి తోడు మోడీ రద్దు చేసిన వ్యవసాయ నల్ల చట్టాలలో ఉన్న ప్రతికూల అంశాలన్నీ ఏదో ఒక రూపంలో వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తే రైతులు, గ్రామీణ ప్రజానీకం నష్టపోతారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి వాటిని ఓడించి సహకార రంగాన్ని, ఆ రంగం రగిలించిన స్ఫూర్తిని కాపాడుకొని, సహకార రంగ విస్తరణకు పూనుకోవడమే దీనికి ప్రత్యామ్నాయం.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు/



జనవాక్యం

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అకాడెమీ టెక్స్ట్ బుక్స్, ప్రభుత్వ స్టడీ మెటీరియల్స్, ప్రాక్టికల్స్ మెటీరియల్, బేసిక్ లెర్నింగ్ మెటీరియల్స్ ఆన్‌లైన్లో ఇవ్వాలి. తెలంగాణ ఇంటర్ బోర్డు మాదిరిగా అందుబాటులో ఉంచాలని తల్లి దండ్రులు కోరుతున్నారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో దేశంలో దాదాపు అన్ని బోర్డులు విద్యార్థులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో పాఠశాల విద్యాశాఖ కూడా 1-10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చింది. కనుక అధికార్లు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో పేద విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలను, స్టడీ మెటీరియల్‌ను ఆన్‌లైన్లో ఉంచాలని, బోర్డు వెబ్‌సైట్‌ను విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా అప్‌డేట్ చేయాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

- సురేష్ కుమార్, శ్రీకాకుళం జిల్లా.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి!

బీహార్ రాష్ట్ర ప్రభుత్వం 1.78 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామం. మన రాష్ట్రంలో కూడా సుమారు 50 వేల పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క ఉపాధ్యాయుని కూడా నియమించని పరిస్థితి చూస్తున్నాం. గత ప్రభుత్వంలో ఉన్న విద్యా వాలంటీర్లను కూడా తొలగించారు. ఇందువలన పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారు. విద్యాబోధన లోపభూయిష్టంగా ఉండడంతో డ్రాపవుట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సంక్షేమం పేరుతో అన్ని శాఖల్లో సంక్షోభం నెలకొంది! ఇప్పటికైనా పాలకులు ఉపాధ్యాయ ఖాళీలను సత్వరం భర్తీ చేయాలి!

- జి.భారతీదేవి, ఏలూరు, ఏలూరు జిల్లా.



ఫైట్‌లో కాదు.. పాటలో..


'బిచ్చగాడు-2' సినిమా షూటింగ్ సందర్భంగా సముద్రంలో పడిపోయిన తనను హీరోయిన్ కావ్య థాపర్, కెమెరామెన్ అసిస్టెంట్స్ రక్షించారని హీరో విజయ్ ఆంటోని చెబుతున్నారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. రాధారవి, వైజీ మహేంద్రన్, మన్సూర్ అలీఖాన్, హరీశ్ పెరాడి, జాన్ విజయ్, దేవ్‌గిల్, యోగిబాబు తదితరులు నటించిన ఈ సినిమాని విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానరుపై నిర్మాత ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మించారు. తాజాగా చెన్నైలో చిత్రబృందం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ ఆంటోని చిత్రవిశేషాలను ముచ్చటించారు. 'సాధారణంగా ఫైట్ సన్నివేశాల చిత్రీకరణ సమయంలో నటీనటులు గాయపడుతుంటారు. కానీ, నేను పాట చిత్రీకరణ సమయంలో గాయపడ్డాను. ఈ ప్రమాదం జరిగిన తర్వాత సముద్రంలో పడిపోయిన నన్ను హీరోయిన్, కెమెరామెన్ అసిస్టెంట్స్ రక్షించారు. ఈ చిత్రం 'పిచ్చైకారన్' కథకు సీక్వెల్ కాదు. ఇది వేరే స్టోరీ. ఎమోషన్స్ పుష్కలంగా ఉంటాయి. క్లైమాక్స్ సన్నివేశంలో కచ్చితంగా ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టుకుంటారు. నా చిత్రాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వడానికి కారణం ఉంది. నా కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. అలాంటి పరిస్థితి ఎదురుకాకూడదని ప్రతిభావంతులైన కొత్తవారికి అవకాశం ఇస్తున్నాను. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అని అన్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు సంగీతం కూడా విజయ్ ఆంటోనీనే అందించారు.

9న 'ఖుషి' ఫస్ట్ సాంగ్




యువ నటుడు విజయ్ దేవరకొండ, నటి సమంత కలయికలో శివ నిర్వాణ దర్శకత్వంలో తాజాగా తెరకెక్కుతున్న లవ్, రొమాంటిక్ ఎంటర్టైనర్ మూవీ ఖుషి. ఈ మూవీ యొక్క షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీని పాన్ ఇండియన్ రేంజ్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు హేషం అబ్దుల్ వాహాబ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 'నా రోజా నువ్వే...' అనే పాటను మే 9న పలు భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సరిగమ సౌత్ వారు ఈ మూవీ యొక్క ఆడియో రైట్స్‌ని దక్కించు కున్నారు. ఇక అన్ని కార్యక్రమాలు ముగించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది.

శరత్‌బాబు బాగానే ఉన్నారు..




టాలీవుడ్ సీనియర్ నటుడు శరత్‌బాబు చనిపోయారని బుధవారం రాత్రి నుండి సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో కొందరు సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతూ తమ సోషల్ మీడియా అకౌంట్లో పోస్టులు పెట్టి తర్వాత డిలీట్ చేశారు. తాజాగా ఈ వార్తలపై శరత్‌బాబు కుటుంబ సభ్యులు స్పందించారు. అన్నయ్య త్వరలోనే కోలుకుని మీడియాతో మాట్లాడతారని శరత్‌బాబు చెల్లెలు అన్నారు. దయచేసి ఇలాంటి తప్పుడు వార్తలు రాయొద్దని కోరారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురైన 71 సంవత్సరాల శరత్ బాబుకు ఆరోగ్యం క్షీణించి ఏఐజి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఆయన త్వరగా కోలుకుంటారని ఏఐజీ ఆస్పత్రి ఆశాభావం వ్యక్తం చేసింది.



అనుపమ్ ఖేర్ 'విజయ్ 69' లుక్

బాలీవుడ్ ప్రొడక్షన్ హౌజ్ యశ్ రాజ్ ఫిలిమ్స్ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ఓటీటీ ఫిల్మ్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'విజయ్ 69' టైటిల్ ఫైనల్ చేశారు. బాలీవుడ్ దర్శక నిర్మాత, నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ అనుపమ్ ఖేర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో చిత్రం ఫస్ట్ లుక్‌ను లాంఛ్ చేశారు మేకర్స్. ఇందులో అనుపమ్ స్విమ్మింగ్, బై సైక్లింగ్, రన్నింగ్‌లో పోటీ పడే 69 ఏండ్ల వృద్ధుడి పాత్రలో నటిస్తున్నాడు. స్పోర్ట్స్ వేర్‌లో సైక్లింగ్ చేస్తున్న లుక్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. మేరీ ప్యారీ బిందు ఫేం అక్షయ్ రాయ్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నాడు. మనీశ్ శర్మ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ దశలో ఉంది

ఆగస్టు 10న 'జైలర్'



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి 'జైలర్'. తాజాగా ఆగష్టు 10న ఈ సినిమా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. యాక్షన్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్, టాలీవుడ్ యాక్టర్ సునీల్, తమన్నా ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, యోగిబాబు, వసంత్ రవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు సన్ పిక్చర్స్ బ్యానర్ ట్వీట్ చేసింది. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

దిగ్భ్రాంతికిగురయ్యాం : స్టాలిన్

చెన్నై : దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై భౌతిక దాడి జరగడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మన ఛాంపియన్ రెజ్లర్లకు జరిగిన ఘోర అన్యాయ్యాన్ని చూసి మేం దిగ్భ్రాంతికి గురయ్యామని తెలిపారు. ఈ మేరకు స్టాలిన్ ట్వీట్ చేశారు. 'మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మన ఛాంపియన్ రెజ్లర్లకు జరిగిన ఘోర అన్యాయాన్ని చూసి మేం ఆశ్చర్యపోయాం. ఇలా జరగకూడదు' అని తెలిపారు.'మన గౌరవనీయులైన ప్రధానమంత్రి మహిళలకు సాధికారత కల్పించడంపై ఉపన్యాసాలు ఇస్తూనే ఉంటారు. ఈ తప్పుడు వాగ్దానాలకు భిన్నంగా బాధితుల్ని చిత్రహింసలకు గురి చేయడం, నిందితులకు రక్షణ కల్పించడం బిజెపి లక్షణంగా మారింది. కథువా, ఉన్నావ్, హత్రాస్, బిల్కిస్ బానో తదితర కేసుల్లో దీని మనం చూశాం' అని ట్వీట్‌లో తెలిపారు.

సమర్థుడే లేడా?

- ఈడీ చీఫ్ పదవీకాలం పొడిగింపుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధిపతి సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని మూడోసారి పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ పదవిని నిర్వహించడానికి ఈడీలో వేరే సమర్థుడు ఎవరూ లేరా అని ప్రశ్నించింది. 'కేవలం ఆ పదవికి ఆయనే అనివార్యమైన వ్యక్తా? ఈడీలో సమర్థుడైన వేరే వ్యక్తి ఎవరూ లేరా? 2023 తర్వాత ఏం జరుగుతుంది? ఆయన ఎప్పుడు రిటైర్ అవుతారు?' అంటూ నిలదీసింది. మిశ్రా పదవీకాలాన్ని పొడిగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, విక్రమ్ నాథ్, సంజయ్ కోరల్‌తో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. 2018 నవంబర్ 18న ఈడీ చీఫ్‌గా మిశ్రా నియమితులయ్యారు. ఆ తర్వాత ఆయన పదవీకాలాన్ని 2020, 2021లో కేంద్రం పొడిగించింది. ఇకపై మిశ్రా పదవీకాలాన్ని పొడిగించవద్దని సుప్రీంకోర్టు 2021 సెప్టెంబర్‌లో కేంద్రాన్ని ఆదేశించింది. అయితే అదే సంవత్సరం నవంబర్‌లో కేంద్రం రెండు ఆర్డినెన్సులు జారీ చేస్తూ ఈడీ, సీబీఐ అధిపతుల పదవీకాలాన్ని ఐదేండ్లకు పెంచింది. దీంతో మిశ్రాకు మరోసారి పొడిగింపు ఇచ్చినట్లయింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో తన వాదనలు వినిపిస్తూ అంతర్జాతీయ సంస్థలతో వ్యవహారాలు జరిపేటప్పుడు డైరెక్టర్ పదవీకాలాన్ని పొడిగించాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. పైగా పిటిషన్లు దాఖలు చేసింది రాజకీయ పార్టీల నాయకులని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి గవాయ్ స్పందిస్తూ ఆ ఒక్క కారణంతో పిటిషన్లు దాఖలు చేయకుండా వారిని నిరోధించలేమని అన్నారు.

ఢిల్లీలో దట్టమైన పొగమంచు

న్యూఢిల్లీ : ఢిల్లీలో కాలానికి తగ్గట్టుగా వాతావరణం అనుకూలంగా ఉండదు. మే నెలలో ఎండలు మండిపోవాల్సిన కాలంలో.. దట్టమైన పొగమంచు కురుస్తోంది. దీంతో ఢిల్లీలోని వాతావరణ పరిస్థితులపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం దట్టమైన పొగమంచుతో దేశరాజధానిని కప్పేసింది. ఈ పొగమంచుని చూసి నివాసితులు షాక్ అయ్యారు. సాధారణంగా మే నెలలో 39.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఎండలు మండిపోతుంటాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం, పగలు-రాత్రి ఉష్ణోగ్రతల మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉండడం వల్ల పొగమంచు ఏర్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని భారత వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 501 నుంచి 1000ల మధ్య దృశ్యమానత ఉన్నట్లుగా ఐఎండి అంచనా వేసింది. అలాగే గడచిన 24 గంటల్లో 30 మిల్లీమీటర్ల వర్షపాత నమోదైనట్లు ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రాథమిక వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 30.6 డిగ్రీలు నమోదైంది. సాధారణ ఉష్ణోగ్రత కన్నా.. 9 డిగ్రీల తక్కువగా నమోదైందని ఐఎండి వెల్లడించింది. ఇక గురువారం 15.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయి. గడచిన 13 సంవత్సరాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవ్వడం ఈరోజేనని ఐఎండి పేర్కొంది. ఆల్‌టైమ్ కనిష్ట ఉష్ణోగ్రతగా మే 2 1982వ సంవత్సరంలో 15.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఢిల్లీలో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లాలో గురువారం తెల్లవారుజామున ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. సంఘటన స్థలంలో ఏకే 47 రైఫిల్, ఒక పిస్టల్, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనగర్‌కు చెందిన డిఫెన్స్ ప్రతినిధి కల్నల్ ఎమ్రాన్ ముసావి మాట్లాడుతూ.. ఎల్‌ఓసి మీదుగా ఉగ్రవాదులు మనదేశంలోకి చొరబడే అవకాశం ఉందని సమాచారం అందింది. దీంతో కేంద్ర భద్రతా దళాలను హై అలర్ట్ చేశామని చెప్పారు. ఈ క్రమంలో ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని వనిగామ్ పయిూన్ క్రీరీ ప్రాంతంలో భద్రతా బలగాలు గురువారం తెల్లవారుజామున అక్కడ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయని తెలిపారు. భద్రతా బలగాల సెర్చ్ పార్టీపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతిచెందినట్లు తెలిపారు. కాగా ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలోని పిచ్నాడ్ మచిల్ ప్రాంతంలో బుధవారం భద్రతా దళాలు ఇద్దరు ఉగ్రవాదులను కాల్చి చంపాయి.



'సిఎంకు కృతజ్ఞతలు'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాక్షర భారత్‌లో పనిచేస్తూ గత ప్రభుత్వ హయాంలో తొలగించిన 500 మంది మండల సమన్వయకర్తలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో మండల సమన్వయ కర్తలుగా తిరిగి నియమించినందుకు సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్స్ సిఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ప్రసాద్, బాపేశ్వరరావు సిఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎంను కలిశారు. సర్వే డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న 11 వేలమంది గ్రేడ్-3 సర్వేయర్లను గ్రేడ్-2 సర్వేయర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ఎపి సర్వే ఎంప్లాయిూస్ అసోసియేషన్ సిఎంకు కృతజ్ఞతలు తెలిపింది. సిఎంను కలిసిన వారిలో ఎపి గవర్నమెంటు ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ జెఎసి ఛైర్మన్ విఎస్ దివాకర్, సర్వే ఎంప్లాయిూస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ చిరంజీవిరావు ఉన్నారు.

కామాంధుడికి క్షమాభిక్ష నిరాకరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నాలుగేళ్ల చిన్నారిపై అతి దారుణంగా లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన కేసులో దోషికి క్షమాభిక్ష పెట్టేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిరాకరించారు. 2008 కేసులో దోషి వసంత సంపత్ దుపారే దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్ ను ఆమె ఇటీవల తిరస్కరించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ కార్యాలయం గురువారం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 28న దుపారే క్షమాభిక్ష పిటిషన్‌ను కేంద్ర హోం శాఖ రాష్ట్రపతి సచివాలయానికి సిఫార్సు చేసింది. ఈ పిటిషన్‌ను ఏప్రిల్ 10వ తేదీనే రాష్ట్రపతి ముర్ము తిరస్కరించినట్లు తెలిపింది.

2008లో మహారాష్ట్రలో ఓ నాలుగేళ్ల బాలిక, వసంత దుపారే (అప్పటికి అతని వయసు 46 ఏళ్లు) చేతిలో దారుణ హత్యాచారానికి గురైంది. చిన్నారి పొరుగింట్లో ఉండే దుపారే.. తినుబండారాల ఆశ చూపించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను బండరాళ్లతో కొట్టి హత్య చేశాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దుపారేను అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. అతడిని దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. ఆ శిక్షను బాంబే హైకోర్టు సమర్థించింది. ఈ తీర్పుపై 2014లో దుపారే సుప్రీంకోర్టు ను ఆశ్రయించగా అక్కడ ఊరట లభించలేదు. అతడి మరణశిక్షను సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో ఈ తీర్పును పున్ణసమీక్షించాలని కోరుతూ 2016లో దుపారే మరో పిటిషన్ దాఖలు చేశాడు. అయితే ఈ రివ్యూ పిటిషన్‌ను కూడా 2017లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. అతడి మరణశిక్షను మరోసారి సమర్థించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన 10 మంది మృతి

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై ఎస్‌యూవీ, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మంది మతి చెందగా, పలువురు గాయపడ్డారు. మరణించిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో గాయపడిని వారిని ఆస్పత్రికి తరలించారు. వీరంతా సొరం నుంచి మర్కటోలాకు వెళ తుండగా ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాలిక,పిల్లలు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు .ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే పురూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నలుగురు ఐపిఎస్‌లు బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వెయిటింగ్‌లో వున్న నలుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. షేక్ షరీన్ భేగంను వక్ఫ్ సర్వే కమిషనరుగా నియమించారు. కెఎం మహేశ్వరరాజుకు ప్రధాన కార్యాలయంలో ఎస్ఇబి ఎస్‌పిగా, ఎబిటిఎస్ ఉదయరాణిని ఎన్‌టిఆర్ జిల్లా టెక్నికల్ డిసిపిగా, జి శ్రీకాంత్‌కు హెడ్‌క్వార్టర్స్‌లో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎఐజిగా పోస్టింగు ఇచ్చారు.

బందరు వైద్య కళాశాలకు గ్రీన్ సిగ్నల్

- ముఖ్యమంత్రికి పేర్ని కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మచిలీపట్నంలో నిర్మించనున్న వైద్యకళాశాలకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న వైద్యకళాశాలల్లో ఇది నాలుగోది. ఇక్కడ ఈ విద్యా సంవత్సరం నుంచే 150 ఎంబిబిఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించేలా ఎన్ఎంసి గురువారం అనుమతులు మంజూరు చేసింది. మచిలీపట్నం మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతులపై మాజీ మంత్రి పేర్ని నాని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సిఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజీతో పాటు బందరు ప్రజల చిరకాల కోరిక పోర్టు నిర్మాణానికి ఈ నెల 22న సిఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారని పేర్ని తెలిపారు.

ఏం కొంటాం..ఏం తింటాం..

ఆహారం ధర పైపైకి...

న్యూఢిల్లీ : దేశంలో ఆహారం ధర పెరిగింది. గోధుమలు, చికెన్, వంటగ్యాస్, వంటనూనెల ధరల పెరుగుదల ప్రభావం ఆహారం పైన పడింది. గత సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో శాఖాహార భోజనం ధర 9 శాతం, మాంసాహార భోజనం ధర 32 శాతం పెరిగిందని క్రిసిల్ నెలవారీ భోజన ప్లేటు ధర సూచిక తెలిపింది. బ్రాయిలర్ కోడి మాంసం ధర యాభై శాతానికి పైగా పెరగడంతో మాంసాహార భోజన ధరలో పెరుగుదల అధికంగా ఉంది. ఉత్పత్తి తగ్గడంతో గోధుమల ధరలు కూడా 15 శాతం మేర పెరిగాయి. వంటనూనెల ధరలు 6 శాతం, వంటగ్యాస్ ధర 20 శాతం మేర పెరిగాయి.

అయితే ఈ సంవత్సరం జనవరి, ఏప్రిల్ నెలల మధ్యకాలంలో ధరలు కొంతమేర దిగివచ్చాయి. ఏప్రిల్‌లో వంటనూనెలు, బ్రాయిలర్ చికెన్ ధరలు కొంత తగ్గాయి. అయితే గోధుమలు, వంటగ్యాస్ ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ఆహారం ధరలలో పెద్దగా మార్పు రాలేదు.

పుతిన్‌పై డ్రోన్ దాడిని ఖండించిన నికోలస్ మదురో

కారకాస్ : రష్యా అధ్యక్షులు పుతిన్‌పై రెండురోజుల క్రితం జరిగిన డ్రోన్ దాడిని వెనిజులా అధ్యక్షులు నికోలస్ మదురో బుధవారం ఖండించారు. ఈ మేరకు వెనిజులా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ సందర్భంగా తాను రష్యాకు మద్దతు ఇస్తున్నట్లు మదురో ప్రకటించారు. అంతర్జాతీయ భద్రత, శాంతికి ముప్పు కలిగించే చర్యలను వెనిజులా ఎప్పుడూ మద్దతునివ్వదు అని వెనిజులా అధ్యక్ష కార్యాలయ ప్రకటన వెల్లడించింది. కాగా, పుతిన్‌ను హతమార్చేందుకు మే 2-3 తేదీల్లో రాత్రి సమయంలో క్రెమ్లిన్‌లోని తన నివాసంపై రెండు డ్రోన్లు తిరిగాయి. అయితే డ్రోన్ దాడి ప్రయత్నించిన సమయంలో పుతిన్ తన నివాసంలో లేరు. అతను మాస్కో వెలుపల నోవోబొగారియోవోలోని తన ఇంట్లో ఉన్నాడని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ అన్నారు. ఈ డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రోన్ శకలాలే చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ డ్రోన్ దాడికి ఉక్రెయిన్ అధికారులెవరూ బాధ్యత వహించలేదు.

ఏడాదిగా పోరాడుతున్నా గోడు పట్టదా?

- దోసపాడు దళితుల ఆందోళన



ప్రజాశక్తి - దెందులూరు రూరల్ (ఏలూరు జిల్లా)

దోసపాడు పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూములు తక్షణం అప్పగించాలని, ఏడాదికాలంగా పోరాడుతున్నప్పటికీ కనీసం పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రపోతుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు విమర్శించారు. పేదలు, దళితులు చెరువుల్లోకి వెళ్తుండగా పోలీసు బలగాలతో బుధవారం దోసపాడులో అడ్డుకున్నారు. దీంతో దళితులు దోసపాడు సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం చెరువు వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల భూములను బడాభూస్వాములకు అప్పనంగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. దళితుల అభ్యున్నతికి పాటుపడతామని చెబుతూనే దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. 25 ఏళ్ల నుండి పేదల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేస్తూ పేదల భూములను వారికి దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. భూముల్లోకి వెళ్లకుండా తహశీల్దార్, ఎస్ఐ, పోలీసు బలగాలతో పేదలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. భూముల వివరాలు చెప్పి ఈ భూముల దళితులవేనని ప్రకటించినా వాటిని భూస్వాముల నుండి స్వాధీనం చేసుకోకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. భూస్వాముల ఇచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మండల రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతుంటే జిల్లా అధికారులు మొద్దునిద్రపోతున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులపై, పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడు, పోతునూరు, కొవ్వలి, దెందులూరు తదితర గ్రామాల్లో వందల ఎకరాల పేదల భూములు అన్యాకాంతమయ్యాయని మండిపడ్డారు. ఈ భూములు భూస్వాముల చేతుల్లో ఉండటానికి రెవెన్యూ శాఖ అధికారులే కారణమన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల కనుసన్నల్లో భూస్వాములు దర్జాగా భూములను అనుభవిస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ కలగజేసుకుని పేదలకు చెందిన భూములను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట నాయకులు ఆనందరావు, జూన్ రాజ్, నాగేంద్ర, వినోద్, మణి, లక్ష్మి, బేబీ, లలిత, గంగాధర్ నాయకత్వం వహించారు.

ఆదివాసీల సమస్యలపై 11న 'చలో కలెక్టరేట్'

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆదివాసీ గిరిజన సమస్యల పరిష్కారానికి ఈనెల 11న గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించ తలపెట్టిన 'చలో కలెక్టరేట్' ఆందోళనకు అధికసంఖ్యలో గిరిజనులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. గురువారం చింతపల్లి గిరిజన భవన్‌లో పాడేరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల గిరిజన సంఘం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూకుమ్మడిగా అమాయక గిరిజనులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. హైడ్రోపవర్ ప్రాజెక్ట్ పేరుతో మన్యంలోని గిరిజనుల భూములను నాశనం చేయడానికి కేంద్రంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తంచేశారు. బోయ/ వాల్మీకులు, బెంతు ఒరియాలు, ఇతర అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి నివేదిస్తే, గిరిజనుల ఓట్లతో గెలిచి, అధికారపీఠంపై ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు కనీసం నోరెత్తకుండా దిష్టిబొమ్మల్లా కూర్చున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ తీర్పునిచ్చి మూడేళ్లు గడుస్తున్నా, దీనిపై గిరిజన సలహా మండలిలో కనీసం చర్చించిన దాఖలు లేవన్నారు. ప్రధానంగా ఈ మూడు అంశాలతోపాటు కాఫీ రైతులకు రావాల్సిన కోట్లాది రూపాయల బకాయిలు తక్షణమే చెల్లింపులు, ఇతరత్రా సమస్యలపై చలో కలెక్టరేట్ ఆందోళనకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.

గిరిజనుల సంక్షేమం కోసమే పనిచేస్తున్నామంటున్న రాష్ట్ర ప్రభుత్వం, బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం, హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణంతో మన్యవాసుల మనుగడ ప్రశ్నార్థకం వంటి గిరిజన వ్యతిరేక విధానాలకు పూనుకుంటోందని,తక్షణమే ఆ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గిరిజనులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తూ, ప్రజాప్రతినిధుల్ని అడ్డుకుంటున్నా కనీస స్పందన లేకపోవడం చూస్తే, గిరిజనుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమౌతోందన్నారు. నమ్మించి, ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన మన్యంలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు తిరుగుతున్నారని, ఇది ఏ మాత్రం క్షమించరానిదని హెచ్చరించారు. ఇప్పటికైనా వారంతా గిరిజనుల పక్షాన ఉంటారా? లేదా గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారా తేల్చుకోవాలని హెచ్చరించారు. .గిరిజనులకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ అవి సక్రమంగాఅమలు కాకపోవడం, ఇతరులకు ప్రయోజనకరంగా మారడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనానికి ఇంతగా అన్యాయం జరుగుతున్నా, తమ సొంత ప్రయోజనాలను చూసుకుంటున్న ఏజెన్సీ ప్రజాప్రతినిధులు మౌనం వహిస్తున్నారని, అడవి బిడ్డలకు న్యాయం చేయాలన్న మనస్సాక్షి ఉంటే చట్టసభల్లో గొంతు విప్పేవారని ప్రశ్నించారు. గిరిజనానికి వాటిల్లుతున్న నష్టంపై ప్రశ్నించడానికి ప్రతి గిరిజనుడూ సైనికుడిగా ముందుకు రావాలన్నారు. పోరాటం చేసైనా హక్కులను పరిరక్షించుకోకుంటే, భావితరాల మనుగడ ప్రశ్నార్థకమౌతుందన్నారు. ఈనెల 11న పాడేరులో చలో కలెక్టరేట్ ఆందోళనతో గిరిజన వాణి, ఆక్రందన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినిపించేలా కలెక్టరేట్ దద్దరిల్లాలని, దానికి గిరిజనులందరూ ఐక్యంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి,జీకే వీధి మండల నాయకులు గడుతూరి సత్యనారాయణ,అంపురంగి బుజ్జిబాబు, జి మాడుగుల మండల నాయకులు దీనబంధు, కొయ్యూరు మండల నాయకులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వరల్డ్ ఎకానమిక్ ఫోరం వార్షిక సమావేశానికి కేటీఆర్

- మంత్రికి ఆహ్వానం పంపిన ఫోరం

హైదరాబాద్ : తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావుకి మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. చైనాలోని టియాంజిన్‌లో జరిగే వరల్డ్ ఎకానమిక్ ఫోరం వార్షిక సమావేశానికి హాజరుకావాలని ఫోరం అధ్యక్షులు బోర్గె బ్రెండే గురువారం ఆహ్వానాన్ని పంపించారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు ఈ ఏడాది జూన్ 27 నుంచి 29వ తేదీ వరకు జరగనుంది. ఈ సదస్సుకు చైనాలోని టియాంజిన్ వేదిక కానుంది. కొత్త ప్రణాళికలు, సాంకేతికతతో తెలంగాణ దూసుకెళ్తోందని బోర్గె ప్రశంసల వర్షం కురిపించారు. స్టార్టప్, ఇన్నోవేషన్ సిస్టం, ఎంటర్‌ప్రినర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో దేశానికి ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే సమావేశాల్లో బిజినెస్, గవర్నమెంట్, సివిల్‌సొసైటీ, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్‌కు చెందిన 1500 గ్లోబల్ లీడర్స్ హాజరుకానున్నట్టు వివరించారు. ఈ సమావేశాల్లో కోవిడ్ తర్వాత ఆర్థిక రంగంలో చోటుచేసుకున్న పరిణామాలు, వాతావరణ మార్పులు, పారిశ్రామిక రంగంలో వచ్చిన మార్పుల గురించి చర్చించనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా జూన్‌మాసంలోనే దుబాయ్‌లో జరిగే ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)షోకు కూడా మంత్రి కేటీఆర్ హాజరుకానున్న విషయం తెలిసిందే. ఒకే నెలలో రెండు అంతర్జాతీయ సదస్సులకు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వాణిజ్యశాఖ అధికారులపై పలమనేరు ఎమ్మెల్యే వీరంగం

- చర్యలు తీసుకోవాలి : ఎపి ఎన్‌జిఒ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వాణిజ్యశాఖ అధికారులపై చిత్తూరు జిల్లా పలమనేరు ఎమ్మెల్యే వెంకట్‌గౌడ్ వీరంగం సృష్టించారు. తమ వాహనాలనే ఆపుతారా అంటూ అధికారులపై భౌతిక దాడికి పాల్పడ్డారు. వాహన తనిఖీల్లో భాగంగా వాణిజ్యశాఖ అధికారులు గురువారం పలమనేరులో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎమ్మెల్యే వెంకట్‌గౌడ్ వాహనాలను అధికారులు ఆపారు. తమ వాహనాలనే ఆపుతావా అంటూ అధికారులపై బూతులు మాట్లాడుతూ..భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే తీరును ఎపి ఎన్‌జిఒ సంఘం, సిపిఎం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. విధి నిర్వహణలో ఉన్న వాణిజ్య పన్నులశాఖ అధికారులపై భౌతికంగా దాడి చేసిన పలమనేరి ఎమ్మెల్యే పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల కోసమే స్మార్ట్ టౌన్‌షిప్

- ప్లాట్ల అమ్మకాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

మధ్యతరగతి ప్రజల కోసమే ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లను ప్రారంభించినట్టు డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. గురువారం పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్ల అమ్మకాలను ఆయన బుడా చైర్ పర్సన్ ఇంటి పార్వతి, వైస్ చైర్మన్ మయూర్ అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డి దేనని చెప్పారు. పేదల కోసం నిర్దేశించిన జగనన్న లేఅవుట్ల మాదిరిగానే మధ్యతరగతి ప్రజల కోసం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను ప్రారంభించినట్టు తెలిపారు. 18 లక్షల వార్షికాదాయంలోపు ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లలో ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చదరపు గజం రేటు ఐదువేల రూపాయలంటే చాలా తక్కువేనని, అవకాశం ఉన్న వారంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు

- టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

గిరిజన, మత్స్యకార, దళితవాడలు, ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయ నిర్మాణాలు చేపడుతున్నామని టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. సీతంపేటలో టిటిడి నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైవి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోలేని యాత్రికుల కోసం గత నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 2 వేల ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. సీతంపేటలో ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని మరింతగా విస్తరించి, చుట్టుపక్కల గిరిజనులు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. కురుపాంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె.నివాస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు జె.నివాస్ అన్నారు. గురువారం స్థానిక శనివారపుపేటలోని వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి నివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ క్లీనిక్‌కు వచ్చే రోగులకు ఇబ్బందికరమైన పరిస్థితులుంటే ఇ-టెలీ కన్సల్టేన్సీ ద్వారా స్పెషలిస్టు డాక్టర్లతో ఏలూరు లేదా విజయవాడ వారితో మాట్లాడే విధానాన్ని కమిషనర్ పరిశీలించారు. కొత్తగా విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు కొన్ని రికార్డులు ఇచ్చామని, వీటిని ఎప్పటికప్పుడు అన్ని వివరాలతో నమోదు చేయాలని, వివరాలు స్పష్టంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఈ రికార్డుల్లో డ్రగ్స్ పేషెంట్స్ వివరాలు, రోగులకు ఏ మందులిచ్చారు? అనేది ఈ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకూ ఈ క్లీనిక్‌లో ఎన్ని డయాబెటీస్ పరీక్షలు చేశారని వివరాలు అడిగితెలుసుకున్నారు. క్లీనిక్‌లో ఉన్న వైద్యపరికరాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కమిషనరు ఆశా వర్కర్లు, వాలంటీర్లతో మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం గురించి విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో జరుగుతున్న వైద్య సేవల గురించి రోగులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీమండలానికి రెండు పిహెచ్‌సిలు, ఇద్దరు డాక్టర్లు, ఒక 104 వాహనంతో అనుసంధానం చేసి ప్రతీరోజు వారికి కేటాయించిన గ్రామాల్లోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రోగులకు ఉచిత వైద్య సేవలందించాలని తెలిపారు.

పుష్ప-2 షూటింగ్‌కు ప్రదేశాల ఎంపిక

ప్రజాశక్తి-మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో పుష్పా-2 సినిమా షూటింగ్‌కు అనువైన ప్రదేశాలు ఎంపిక చేసే పనులు దర్శకుడు సుకుమార్, చిత్ర బృందం చేపట్టారు. మోతుగూడెం, పొల్లూరు, ఫోర్ బై జలాశయం పరిసర ప్రాంతాలలో చిత్రీకరణకు అనువుగా ఉండే ప్రాంతాలను సందర్శించారు. మోతుగూడెం, పొల్లురు మధ్య పిక్నిక్ ప్రదేశం, ఫోర్ బై జలాశయం ఎగువన దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లోని పర్యాటక ప్రాంతాలలో, తదుపరి 7 నుండి 17 వరకు మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేస్తామని చిత్ర బృందం తెలిపింది.

బిల్లులో.. మహాప్రభో..!



- ఏడాదికి పైగా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- వంశధారకు రూ.35.66 కోట్లు
- హైలెవల్ కెనాల్ రూ.3.83 కోట్లు పెండింగ్
- ప్రాజెక్టు పనులపై ప్రభావం చూపుతున్న నిధుల సమస్య

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార స్టేజ్-2, ఫేజ్-2 పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని ఒకవైపు చెప్తోంది. మరోవైపు హైలెవల్ కెనాల్‌ను ఆగస్టులో ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత నెల 19వ తేదీన మూలపేట పోర్టు శంకుస్థాపన పనుల సందర్భంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత నెల 19వ తేదీన జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో ఆగస్టులో హైలెవల్ కెనాల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పనులు వేగవంతం చేయాలని చెప్తున్న ప్రభుత్వం, ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. వంశధార, హైలెవల్ కెనాల్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఏడాదికి పైగా బిల్లులు చెల్లించడం లేదని తెలుస్తోంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ప్రభుత్వం సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో, ఆ ప్రభావం సాగునీటి ప్రాజెక్టు పనులపై పడుతోంది. దీంతో జులై నాటికి ప్రాజెక్టులు పూర్తి చేసి ఖరీఫ్ నీళ్లిస్తామన్న ప్రభుత్వ మాటలపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమారు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.2,671.52 కోట్లకు పెంచారు. రెండున్నరేళ్ల కాలంలో నిర్మాణ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 83 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.173.41 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.124.87 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 7.63 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 3.83 కి.మీ మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 25 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 24 నిర్మించారు. ఒప్పంద కాలపరిమితిని ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. 88 ప్యాకేజీ పనులు 92 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.195.15 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.177.85 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 16.6 కి.మీ పూర్తి కాగా, మరో 1.19 కి.మీ మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 37 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 36 నిర్మించారు. ప్యాకేజీ పనులు అక్టోబర్ 28, 2017 నాటికి పూర్తి కావాల్సి ఉంది. పలు కారణాలతో పనులు సకాలంలో కాకపోవడంతో, ఆరు నెలలకోసారి పొడిగించారు. పనులు పూర్తి చేసేందుకు చివరిసారిగా ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేసేలా ఒప్పందం కాలపరిమితిని పొడిగించారు.

రిజర్వాయర్ పనులు 93 శాతం పూర్తి

హిరమండలం రిజర్వాయరు పనుల అంచనా వ్యయం రూ.419.23 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.376.31 కోట్లను వెచ్చించారు. ఇప్పటివరకు 93 శాతం మాత్రమే పూర్తయ్యాయి. రెండున్నరేళ్లలో పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో అప్పట్నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. చివరిసారిగా జూన్ 30వ తేదీ వరకు మరోసారి పొడిగించారు.

హైలెవల్ కెనాల్ 75 శాతం పూర్తి

ఎల్.ఎన్ పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందించేందుకు 2017లో వంశధార, నాగావళి నదుల అనుసంధానం చేస్తూ హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం చివరిసారిగా ఈ ఏడాది జూన్ 30వ తేదీ లోగా పూర్తి చేసేలా కాలపరిమితిని పొడిగించింది. హైలెవల్ వ్యయం రూ.145.34 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.102.30 కోట్లను ఖర్చు చేశారు.

సుమారు రూ.40 కోట్లు పెండింగ్

పనులు వేగవంతం చేయాలని చెప్తున్న ప్రభుత్వం, ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2 పనులకు సంబంధించి రూ.35.66 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 87 ప్యాకేజీ కాంట్రాక్టర్‌కు రూ.11.37 కోట్లు, 88 ప్యాకేజీకి రూ.12.11 కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ.32.14 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. హైలెవల్ కెనాల్‌కు సంబంధించి రూ.3.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటితోపాటు 88 ప్యాకేజీకి రూ.2.89 కోట్లు, హైలెవల్ కెనాల్‌కు సంబంధించి రూ.94 లక్షల మేర సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేశారు. బిల్లును అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మొత్తం మీద రూ.39.49 కోట్లు మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో చెల్లింపులు చేసిన ప్రభుత్వం, ఇప్పటివరకు వారికి బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది.

బిల్లులు రాకపోవడంతో పెట్టుబడులు పెట్టలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు ఆపకుండా ఏదో ఉన్నంత వరకు కానిస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం ప్రాజెక్టు పనులపై ప్రభావం చూపుతోంది. అంతిమంగా రైతులకు నష్టం వాటిల్లనుంది.

కనిపిస్తే కాల్చేయండి



- మణిపూర్ గవర్నర్ ఆదేశాలు
- హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేయిదాటడంతో నిర్ణయం
- సంబంధిత ఉన్నతాధికారులకు ఉత్తర్వులు
- అల్లర్లలో చిక్కుకున్నవారి కోసం సహాయ కేంద్రాలు

ఇంఫాల్ : రెండు గ్రూపుల మధ్య జరిగిన అల్లర్లతో చెలరేగిన హింసతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అట్టుడికింది. రాష్ట్రంలో పరిస్థితులు చేయిదాటాయి. దీంతో కనిపిస్తే కాల్చేయాలంటూ మణిపూర్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులకు గవర్నర్ ఆమోదం తెలిపారు. హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేయిజారడంతో గవర్నర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లు, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్లు, అందరు కార్యనిర్వాహక మేజిస్ట్రేట్లు, ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్లకు మణిపూర్ గవర్నర్ అధికారాన్ని కల్పించారు. రాష్ట్రంలో హింస కారణంగా అల్లర్లలో చిక్కుకుపోయిన వారి కోసం రాష్ట్ర హోం శాఖ కదిలింది. వారి కోసం రిలీఫ్ క్యాంపును ఏర్పాటు చేసింది. అల్లరి మూకలు అనేక ఇళ్లను, దుకాణాలను లూటీ చేయడంతోపాటు దగ్ధం చేశాయి. హింసాత్మక ఘటనలతో ప్రభావితమైన ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు తొమ్మిది వేల మందిని రక్షించి, వారికి వసతి కల్పించినట్లు రక్షణ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అనేక మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితిని అదుపు చేయడానికి సైన్యం రంగంలోకి దిగింది. రాష్ట్ర పోలీసులతో కలిసి సైన్యం, అస్సాం రైఫిల్స్ కూడా ప్రయత్నం చేస్తున్నాయి. గురువారం సాయంత్రానికి 55 కంపెనీల సైన్యం, అస్సాం రైఫిల్స్ రాష్ట్రానికి చేరుకున్నాయి. అనేక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించాయి. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌నూ రంగంలోకి దించాలని కేంద్ర హోం శాఖ భావిస్తున్నట్లు రాష్ట్ర అధికారులు తెలిపారు.

అల్లర్లు ఎందుకు?

షెడ్యూల్ తెగ హోదా కోసం గిరిజనేతర మెయితీ గ్రూప్ డిమాండ్‌ను ఇక్కడి గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. మెయితీ గ్రూప్ డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ అఖిల గిరిజన విద్యార్థి సంఘం మణిపూర్ (ఎటిఎస్‌యుఎం) బుధవారం తుర్బుంగా ప్రాంతంలో గిరిజన సంఘీభావ యాత్రకు పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. అంతకుముందు మెయితీలు ఎస్టీ హోదా కోసం చేసిన డిమాండ్‌కు మణిపూర్ లోయ ప్రాంతానికి చెందిన చట్టసభ్యుల నుంచి మద్దతు లభించింది. ఇది గిరిజన ప్రాంత ప్రజల్లో ఆందోళనను కలిగించింది. ఇది కాస్తా ఈ రెండు గ్రూపుల మధ్య ఘర్షణకు దారి తీసింది. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మెయితీ కమ్యూనిటీకి చెందిన ప్రజలు ఉన్నారు. మణిపూర్ లోయలో వారి ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని పర్వత ప్రాంతాల్లో నివసించేందుకు మెయితీలకు అనుమతి లేదు.

8 జిల్లాల్లో కర్ఫ్యూ.. రంగంలోకి బలగాలు.. ఇంటర్నెట్ నిలిపివేత

ఈ రెండు కమ్యూనిటీల మధ్య చెలరేగిన అల్లర్లు తీవ్ర రూపం దాల్చి హింసాత్మకంగా మారాయి. ఇందుకు చురాచాంద్‌పూర్ కేంద్ర బిందువుగా మారింది. కొద్ది రోజుల క్రితం సిఎం బీరెన్‌సింగ్ పాల్గొనాల్సిన సభ వేదికను కొందరు ఈ ప్రాంతంలో నిరసనకారులు దహనం చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ తాజా ఆదేశాలకు ముందు నిరసనకారులు నివాసాలు, దుకాణాలు, ప్రార్థనా స్థలాలు, వాహనాలకు నిప్పటించారు. ఈ ఘర్షణలను అదుపులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఆర్మీ, రైఫిల్ బలగాలను రంగంలోకి దింపింది. రాజధాని ఇంఫాల్, చురాచాంద్‌పూర్, కాంగ్‌పోక్పిలో ఘర్షణలు జరగడంతో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. ప్రభుత్వం ఇంటర్నెట్‌ను నిలిపివేసింది.

రాష్ట్రం మండిపోతున్నది.. సహాయం చేయండి : ప్రధానిని కోరిన మేరీకోమ్

రాష్ట్రంలోని పరిస్థితులపై ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ సైతం ట్విట్టర్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం మండిపోతున్నదనీ, సహాయం చేయాలని ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆమె అభ్యర్థించారు. రాష్ట్రంలోని పరిస్థితిపై అమిత్ షా ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌తో మాట్లాడారు.

బిజెపి విద్వేష రాజకీయాలే కారణం : కాంగ్రెస్

మణిపూర్‌లో హింసాకాండకు బిజెపి అనుసరిస్తున్న విద్వేష రాజకీయాలే కారణమని కాంగ్రెస్ విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ప్రజల మధ్య చీలికలు సృష్టించి అందమైన రాష్ట్రంలో శాంతిని ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు. 'విద్వేషం, విభజన, అధికార దాహంతో కూడిన బిజెపి రాజకీయాలే ఈ హింసాకాండకు కారణం. మణిపూర్‌లో ప్రజలందరూ సంయమనం పాటించి, శాంతికి కృషి చేయాలి' అని ఖర్గే విజ్ఞప్తి చేశారు.

'ది కేరళ స్టోరీ' పిటిషన్లు అత్యవసరంగా పరిశీలించండి

హైకోర్టుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : 'ది కేరళ స్టోరీ' సినిమాపై దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా పరిశీలించాలని కేరళ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను అత్యవసరంగా పరిశీలించాలన్న డిమాండ్‌ను తిరస్కరించిన జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేరళ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లను ఆదేశించింది. శుక్రవారం సినిమా విడుదలవుతున్నందున, ఈ పిటిషన్లపై అత్యవసర నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు హైకోర్టును ఆదేశించింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది వృందా గ్రోవర్ వాదిస్తూ, సినిమా వెనుక నిరాధారమైన వాస్తవాలను నిజమంటూ ప్రచారం చేసే ఎత్తుగడ ఉందన్నారు.

ఎఆర్ రెహమాన్‌పై సంఘ్ పరివార్ సైబర్ దాడి

ముంబై : కేరళలో మత సామరస్యం, మానవత్వం కోసం పిలుపునిస్తూ వీడియోను షేర్ చేసిన తర్వాత, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ రెహమాన్‌పై సంఘ్ పరివార్ సైబర్ దాడి చేసింది. కుల, మతాలకు అతీతంగా మలయాళీలు సహకరిస్తారని నిరూపించిన అలప్పుజాలో అంజు, శరత్‌ల పెళ్లిని ట్విట్టర్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేశాడు రెహమాన్. ది కేరళ స్టోరీ సినిమా ద్వారా లౌకికవాదానికి వ్యతిరేకంగా సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్న

సమయంలోనే రెహమాన్ స్పందించడం విశేషం. సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన ఆర్ఎస్ఎస్ విద్వేష ప్రచార చిత్రం ది కేరళ స్టోరీ విడుదల అంశం చర్చనీయాంశమైనప్పుడు రెహమాన్ స్పందన వచ్చింది. రెహమాన్ షేర్ చేసిన వీడియోలో వందలాది మంది కేరళను అభినందిస్తూ కామెంట్ చేశారు. ఇది అసలు కేరళ కథ అని చాలా మంది స్పందించారు.

ప్రకాష్ సింగ్ బాదల్ అజాత శత్రువు

- అమిత్ షా సహా వేలాదిమంది ఘనంగా నివాళి

బాదల్ (ముక్తసర్) : ఈ నెల 25న మరణించిన పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ (95) భోగ్ (సంస్మరణ) కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలతో సహా వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. బాదల్ గ్రామంలో ఆయన తల్లి జస్వంత్ కౌర్ పేరుతో నిర్మించిన పాఠశాలలో జరిగిన భోగ్ కార్యక్రమానికి వేలాదిమంది వచ్చి నివాళి అర్పించారు. కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, హర్యానా మాజీ సిఎం ఓం ప్రకాష్ చౌతాలా, సచిన్ పైలట్, కాంగ్రెస్, సిపిఐ, బిఎస్‌పి, ఎస్ఎడి తదితర పార్టీల నేతలు, మతపెద్దలు ప్రభృతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తనలు కూడా పాడారు. భోగ్ కార్యక్రమం సందర్భంగా సిక్కు గ్రంథమైన గురు గ్రంథ సాహిబ్‌ను చదువుతారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమిత్ షా మాట్లాడుతూ, బాదల్ అజాతశత్రువు అని అన్నారు. బాదల్ కొత్త పంజాబ్‌కు పునాది వేశారని, శాంతి, మత సామరస్యత కోసం కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎస్ఎడి చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో సహా బాదల్ కుటుంబం ఈ కార్యక్రమానికి హాజరైంది. ఆయన జీవితం, సాధించిన విజయాలపై పుస్తకాన్ని, కరపత్రాన్ని ఈ సందర్భంగా అందరికీ పంపిణీ చేశారు.

ఇక 'ఆకాశవాణి'

- ఆల్ ఇండియా రేడియో పేరు తొలగింపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రసార భారతి తన రేడియో సర్వీసు సేవలు 'ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్)'ను 'ఆకాశవాణి'గా మార్చివేసింది. ఈ మేరకు అంతర్గత ఉత్తర్వులను ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ వసుధా గుప్తా బుధవారం జారీ చేశారు. ఈ చట్టబద్ధమైన మార్పును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని ఉత్తర్వుల్లో కోరారు. 'ఇది ప్రభుత్వం తీసుకున్న పాత నిర్ణయం. ఇప్పటి వరకూ అమలు చేయలేదు. మేం ఇప్పుడు దీనిని అమలు చేస్తున్నాం' అని ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గౌరవ్ ద్వివేది తెలిపారు. ప్రసార భారతి చట్టం 1997 నవంబర్ 15 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఆకాశవాణి అంటే కార్యాలయాలు, స్టేషన్లు, ఇతర ఏర్పాట్లు మాత్రమే. రేడియో సేవలకు 'ఆల్ ఇండియా రేడియో' అనే పేరే ఉండేది. ఈ సేవలను ఇప్పుడు ఆకాశవాణిగా మార్చారు. ఇటీవల పాఠ్య పుస్తకాల్లో అనేక ముఖ్యమైన పాఠ్యాంశాలను తొలగించిన మోడీ సర్కారు తాజాగా ఈ మార్పులు చేయడం గమనార్హం.

యుపిలో ఎన్‌కౌంటర్.. గ్యాంగ్‌స్టర్ హతం

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మరో గ్యాంగ్‌స్టర్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. గ్యాంగ్‌స్టర్ అనిల్ దుజానా ఉత్తరప్రదేశ్ మీరట్‌కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కాల్చి చంపారు. పశ్చిమ యూపీకి చెందిన అనిల్ దుజానాపై హత్యలు, దోపిడీలు, భూ కబ్జాలు వంటి మొత్తం 62 కేసులున్నాయి. 2012 నుంచి జైల్లో ఉంటున్న అనిల్ 2021లో బెయిల్‌పై విడుదలయ్యాడు. పాత కేసుల్లో కోర్టుకు హాజరుకాకపోవడంతోపాటు.. తనపై నమోదైన హత్య కేసులో కీలక సాక్షులను బెదిరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అతన్ని పట్టుకునే క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనిల్ దుజానా మరణించాడని పోలీసులు చెబుతున్నారు.

నేడు శరద్ పవార్ వారసుడి ఎంపిక..!

ముంబయి : దేశరాజకీయాల్లో కీలక నేత, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేతగా ఉన్న శరద్ పవార్ ఆ పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన వారసుడి ఎంపిక జరగనున్నట్లు తెలిసింది. ప్రముఖ రాజకీయ నాయకుడు శరద్ పవార్ రెండు రోజుల క్రితం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్‌గా రాజీనామా చేసిన తర్వాత ఆయన వారసుడు ఎవరన్న దానిపై ప్రశ్నలు వస్తున్నాయి. ముంబైలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో ఆయన వారసుడు ఎవరనేదానిపై స్పష్టత రావచ్చని తెలుస్తోంది. శరద్ పవార్ తన రాజీనామా నిర్ణయంపై పునరాలోచించుకోకపోతే ఆయన కుమార్తె సుప్రియా సూలే పార్టీ అధినేత్రి అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్‌సిపిలో శరద్ పవార్ తర్వాత కీలక నేతగా ఉన్న అజిత్ పవార్‌కు కూడా అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ఎంపిగా కనిమొళి ఎన్నికను సమర్థించిన సుప్రీం

న్యూఢిల్లీ : డిఎంకె నాయకురాలు కనిమొళి కరుణానిధి 2019లో తూత్తుకుడి ఎంపిగా ఎన్నిక కావడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఆమె ఎన్నికకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. నామినేషన్ సమయంలో కనిమొళి తన జీవిత భాగస్వామి పాన్ నంబర్ వెల్లడించలేనందున అనర్హురాలిగా ప్రకటించాలంటూ తమిళనాడు హైకోర్టులో ఎ.సంతన్‌కుమార్ పిటీషన్ దాఖలు చేయగా, హైకోర్టు విచారణకు స్వీకరించింది. తన జీవిత భాగస్వామికి పాన్ నంబర్ లేకపోవడం వల్లే వెల్లడించలేదని సుప్రీం దృష్టికి కనిమొళి తీసుకొచ్చారు. ఆమె అభ్యర్థన మేరకు విచారించిన జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా త్రివేదిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమెకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు విచారణపై స్టే విధించింది.

నేడు ఎస్‌సిఓ విదేశాంగ మంత్రుల సమావేశం

- ఆర్థిక సహకారం పెంపు, జాతీయ కరెన్సీల్లో చెల్లింపులే ప్రధాన ఎజెండా

బెనాలిమ్, గోవా : షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) విదేశాంగ మంత్రుల సమావేశం శుక్రవారం బెనాలిమ్‌లో ప్రారంభం కానుంది. పరస్పర వాణిజ్యం కోసం జాతీయ కరెన్సీల్లో చెల్లింపులతో సహా ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం ప్రధానంగా ఈ సమావేశం ఎజెండాలో వుంది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించడంతో సెంట్రల్ ఆసియన్ సభ్యుల నుంచి ఈ ప్రతిపాదన వచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఇప్పటికే ఎస్‌సిఓ సభ్య దేశాలైన రష్యా, చైనా, భారత్, పాకిస్తాన్, కజకస్తాన్, కిర్గిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌ల మధ్య ఈ అంశంపై ప్రాథమిక చర్చలు ప్రారంభమయ్యాయని తెలుస్తోంది. జాతీయ కరెన్సీలను ఉపయోగించే చెల్లింపులు జరపడంపై భారత్ ఇప్పటికే రష్యాతో ద్వైపాక్షిక చర్చలు జరిపింది. అమెరికా, యురోపియన్ యూనియన్‌లు ఏకపక్షంగా విధించిన ఆంక్షలను తప్పించుకోవడానికి గల ఇతర మార్గాలపై చర్చిస్తోంది. బ్రిక్స్ గ్రూపులో భాగంగా బహుళపక్ష చెల్లింపుల యంత్రాంగంపైనా చర్చిస్తున్నారు. భారత్ అధ్యక్షురాలిగా వ్యవహరించే ప్రస్తుత సమయంలో సభ్య దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సహకారం, స్టార్టప్‌లు, వినూత్న అన్వేషణలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి ఇతర అంశాలు ఎజెండాలో వుంటాయని సూచనప్రాయంగా తెలిపారు.

విదేశాంగ మంత్రి జై శంకర్, ఎస్‌సిఓ సెక్రటరీ జనరల్ ఝాంగ్ మింగ్ గురువారం ఉదయం ఈ అంశాలన్నింటినీ చర్చించారు. శుక్రవారం ఉదయం ఎస్‌సిఓ సమావేశానంతరం విదేశాంగమంత్రులు చర్చించి, ఆమోదించే 15 నిర్ణయాంశాలను కూడా వారు సమీక్షించారు. అవగాహనా ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ ఏడాది జులైలో ఎస్‌సిఓ దేశాధినేతల సదస్సులో జాతీయ కరెన్సీలో చెల్లింపులతో సహా అన్ని అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటారు.

పెరిగిన ఎన్నికల బాండ్ల విక్రయం

- కర్ణాటకలో 2018తో పోలిస్తే తొమ్మిది రెట్లు అధికం

బెంగళూరు : కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో పెద్ద మొత్తంలో విరాళాలు అందాయి. 2018తో పోలిస్తే ఇప్పుడు బాండ్ల రూపంలో పార్టీలకు తొమ్మిది రెట్ల సొమ్ము అధికంగా లభించింది. రాజకీయ పార్టీలకు నిధులు అందించేందుకు ఉద్దేశించిన ఈ బాండ్ల విక్రయాన్ని ఎస్‌బిఐ ఏప్రిల్ 3న ప్రారంభించి 12న ముగించింది. 29 శాఖల ద్వారా బాండ్లను విక్రయించింది. రాజకీయ పార్టీలకు అందించేందుకు ప్రజలు లేదా కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి బాండ్లను కొనుగోలు చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం 2018 జనవరిలో ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టింది.



గత నెలలో రూ.970.50 కోట్ల విలువైన 1,470 ఎన్నికల బాండ్లను బ్యాంక్ విక్రయించింది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా బ్యాంక్ ఈ వివరాలు అందించింది. 2018 ఎన్నికల సమయంలో ఏప్రిల్‌లో రూ. 114.90 కోట్ల విలువైన 256 బాండ్లు అమ్ముడుపోయాయి. ఈ సంవత్సరం అమ్మిన బాండ్లలో 58 శాతం బాండ్లను ఢిల్లీలో పార్టీలు నగదుగా మార్చుకున్నాయి. హైదరాబాద్ ఎస్‌బిఐలో అత్యధికంగా రూ.335.30 కోట్ల విలువైన బాండ్లను విక్రయించారు. కోల్‌కతా, ముంబయి, చెన్నై, ఢిల్లీ బ్రాంచీలు ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి.

బీహార్ కులగణనపై స్టే

పాట్నా : బీహార్‌లో కుల గణనపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చింది. బడుగు బలహీన వర్గాల వారిని ఆదుకునే ఉద్దేశంతో నితీష్ కుమార్ కుల ఆధారిత సర్వే నిర్వహిస్తున్నారు. నిజానికి కుల గణన చేపట్టాల్సింది కేంద్ర ప్రభుత్వమే. నితీష్ కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని చాలాసార్లు కోరారు. కేంద్రం నుంచి సరైన సమాధానం లేకపోవడంతో నితీష్ ప్రభుత్వమే స్వయంగా తమ రాష్ట్రంలో కులగణనకు పూనుకుంది. ఈ గణనకు బిజెపి మినహా బీహార్‌లోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. దీంతో జనవరి 7న అధికారికంగా కుల గణన ప్రారంభమైంది. ఈ క్రమంలోనే కులాల వారీగా ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిని తెలుసుకునే సర్వేలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందంటూ బిజెపి ఆరోపణలు చేసింది. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలకు ఈ సర్వే మెరుగైన లబ్ధిని అందిస్తుందని, ప్రభుత్వ లక్ష్య సహాయాన్ని చేరుకోవడానికి సహాయ పడుతుందని సిఎం నితీష్‌కుమార్ అన్నారు. ఇప్పటికే దేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల లెక్కలు వస్తున్నాయి. ఒబిసి వర్గాలకు చెందిన లెక్కలు తేలడం లేదు. ఒబిసిల సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవడానికే బీహార్ ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టింది. రూ.500 కోట్ల బడ్జెట్‌తో ఆరంభించిన ఈ సర్వే రెండు భాగాలుగా సాగుతోంది. ఇప్పటికే ఒక సర్వే పూర్తయింది. మొదటి విడతలో జనవరి 7 నుంచి 21 తేదీ వరకు సర్వే జరిగింది. ఇక రెండవ విడత సర్వే ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు నిర్వహించాలి. కొన్ని అభ్యంతరాలు, అడ్డంకుల నడుమ సర్వే అర్ధాంతరంగా నిలిచిపోయింది.

మృతుల కుటుంబ సభ్యులు చట్టబద్ధ వారసులే

- రాజధాని కేసులో ఎపి ప్రభుత్వం అప్లికేషన్
- సుప్రీంకోర్టులో 9న కేసు విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతి కేసులో చనిపోయిన ప్రతివాదులు తరపున కుటుంబ సభ్యులను చట్టబద్ధ వారసులుగా గుర్తిస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వ్యాజ్యకాలీన దరఖాస్తు (ఐఎ) దాఖలు చేసింది. రాజధాని అమరావతిపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఐఎపై ఈ నెల 9న సుప్రీంకోర్టులో విచారణకు రానున్నాయి. రాజధాని అమరావతి పిటిషన్ల విచారణను గత విచారణ సమయంలో సుప్రీంకోర్టు జులై 11న వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఇద్దరు మృతిచెందారని, వారి తరపున చట్టబద్ధ వారసులను (లీగల్ హెయిర్స్) రాష్ట్ర ప్రభుత్వం గుర్తించలేదని గత విచారణ సందర్భంగా ప్రతివాదుల తరపున న్యాయవాది ఉన్నం మురళీధర్... ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ విషయం తమకు తెలియదని, ప్రతివాదులు చట్టబద్ధ వారసులను గుర్తిస్తూ పిటిషన్ దాఖలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది నిరంజన్ రెడ్డి అన్నారు. చట్టబద్ధ వారసులను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వ్యాజ్యకాలీన దరఖాస్తు (ఐఎ) దాఖలు చేసింది. 9న సుప్రీంకోర్టు ఐఎపైనే విచారణ చేపట్టనుంది.

కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన అమర్త్యసేన్

కోల్‌కతా : శాంతినికేతన్‌లో ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయాలని విశ్వభారతి యూనివర్సిటీ ఆదేశాలు జారీ చేయడంతో, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఖాళీ స్థలాన్ని సేన్ అక్రమంగా ఆక్రమించారని, ఈ నెల 6వ తేదీ అక్కడ నుంచి ఆయన వెళ్లకుంటే, తామే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని విశ్వభారతి యూనివర్సిటీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. జస్టిస్ బిబాస్ రంజన్ దే నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును విచారించనున్నది. తన తండ్రి అశుతోష్ సేన్‌కు 1943 అక్టోబర్‌లో విశ్వభారతి వర్సిటీ 1.38 ఎకరాల భూమిని 99 ఏళ్లకు లీజు ఇచ్చిందని, ఆ భూమిలోనే ప్రతీచి బిల్డింగ్‌ను కట్టినట్లు అమర్త్య సేన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ సేన్‌కు మద్దతుగా ఆయన ఇంటి ముందు ధర్నా చేపట్టాలని మంత్రులను సిఎం మమతా బెనర్జీ కోరారు. తాము ఆ బిల్డింగ్‌ను కూల్చడం లేదని విశ్వభారతి అధికారి ఒకరు తెలిపారు. వర్సిటీ ఆదేశాలపై కోర్టు తాత్కాలిక స్టే ఇచ్చింది.

హక్కి పిక్కి గిరిజనుల తరలింపు పూర్తి

న్యూఢిల్లీ : సూడాన్‌లో చిక్కుకున్న కర్ణాటకకు చెందిన 71 మంది హక్కి పిక్కి గిరిజనుల తరలింపును భారత ప్రభుత్వం పూర్తి చేసింది. కేంద్రం ప్రసుత్తం చేపడుతున్న ఆపరేషన్ కావేరీలో ఇది ఒక ముఖ్యమైన భాగంగా భావిస్తున్నారు. సూడాన్ పశ్చిమ తీరంలోని డార్ఫర్ నుంచి సౌదీ అరేబియాలోని జెద్దాకు వీరి తరలింపు పూర్తయిందని, నాలుగు రోజుల పాటు వీరి ప్రయాణం రెండు బస్సుల్లో సాగిందని సూడాన్ రాజధాని ఖర్టూమ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. సూడాన్‌లో చిక్కుకున్న హక్కి పిక్కి గిరిజనుల గురించి కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్య మాటల యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే.

'వెలిగొండ' నిర్మాణం ఆపాలి

కృష్ణాబోర్డుకు సర్కారు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్తులో ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసే సమయంలో బేసిన్‌లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణా ట్రిబ్యునల్-1 (బచావత్ ట్రిబ్యునల్) అవార్డులో పేర్కొన్నా... ఎపి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని కృష్ణాబోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈమేరకు రాష్ట్ర సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ మూడు పేజీల లేఖను ఇటీవల కృష్ణాబోర్డు చైర్మన్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. తదనుగుణంగానే, బచావత్ ట్రిబ్యునల్ సెప్టెంబర్ 1960 తరువాత చేపట్టిన ప్రాజెక్టులకు కేటాయింపులు చేసినప్పుడు, కేవలం కృష్ణా నది బేసిన్ లోపలి ప్రాజెక్టులకు మాత్రమే నీటి కేటాయింపులు చేసిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు వ్యతిరేకంగా, వెలిగొండ ప్రాజెక్టు లాంటి కృష్ణా బేసిన్ ఆవలి ప్రాజెక్టులను, మిగులు జలాలను కేటాయించిందని లేఖలో సవివరంగా తెలియజేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల, బేసిన్ లోని కరువు ప్రాంతాలకు నీరందించే తెలంగాణ ప్రాజెక్టులు (ఇప్పటికే నిర్మించినవి, నిర్మాణంలో ఉన్నవి) నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రోజుకు ఒక టిఎంసి చొప్పున బేసిన్ ఆవలకు నీటిని మళ్లించే వెలిగొండ ప్రాజెక్టును వెంటనే నిలువరించాలని కృష్ణా బోర్డును తెలంగాణ కోరింది. బచావత్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం, అనుమతులన్నీ లభించాకే వెలిగొండ ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది.

పాక్‌లో ఏడుగురు ఉపాధ్యాయుల దారుణ హత్య

స్కూలును చుట్టుముట్టిన దుండగులు

కుర్రమ్ : పాకిస్తాన్‌లో అత్యంత సున్నితంగా వుండే వాయవ్య ప్రాంతంలో ఒక స్కూలుని చుట్టుముట్టిన సాయుధులు ఏడుగురు టీచర్లను బలితీసుకున్నారు. విడిగా జరిగిన మరో దాడిలో అదే స్కూలుకి చెందిన మరో టీచర్ మరణించినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్ఘనిస్తాన్‌కు సరిహద్దుల్లో వాయవ్య ఖైబర్ ఫక్తూన్‌ఖవా ప్రావిన్స్‌లోని జిల్లా అయిన కుర్రమ్‌లో గురువారం కొంతమంది సాయుధుల బృందం ప్రభుత్వ పాఠశాలను చుట్టుముట్టి ఏడుగురు టీచర్లను హత్య చేసింది. ఆ సమయంలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. చనిపోయిన ఏడుగురు టీచర్లు షియా కమ్యూనిటీకి చెందినవారే. అదే రోజు కుర్రమ్‌లో రోడ్డుపై జరిగిన మరో దాడిలో సున్నీ ముస్లిం మహిళా టీచర్ చనిపోయారు. ఈ దాడులకు తమదే బాధ్యత అని ఇంతవరకు ఏ సంస్థ ప్రకటించలేదు. టీచర్లను హత్య చేసిన వారి గురించి ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసు అధికారి తెలిపారు.

కాంగ్రెస్ కార్యాలయం ధ్వంసం

బజరంగ్ దళ్ గూండాల ఘాతుకం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో బజరంగ్‌దళ్ గూండాలు రెచ్చిపోయారు. జబల్‌పూర్‌లోకి కాంగ్రెస్ కార్యాలయంలోకి చొచ్చుకువచ్చిన బజరంగ్ దళ్ గూండాలు కాంగ్రెస్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. బజరంగ్ దళ్ గూండాల వీరంగాన్ని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత కెకె మిశ్రా తీవ్రంగా ఖండించారు. హింసాకాండ, అల్లర్లు, హత్యలు, గూండాయిజానికి పాల్పడటం, గర్బాలో పాల్గొనే మహిళల గురించి ఆరా తీయడం వంటి పనులు బజరంగ్ దళ్ కార్యకర్తలు చేస్తుంటారని విమర్శించారు. బజరంగ్ దళ్ జాతీయవాద సంస్థని సీఎం చెబుతున్నారని, ఆయన ఈ ప్రకటన చేసిన 24 గంటల్లోనే బజరంగ్ దళ్ గూండాలు విధ్వంసానికి పాల్పడ్డారని మిశ్రా అన్నారు. జాతీయ వాదులు ఇలాంటి పనులు చేస్తారా అని ప్రశ్నించిన మిశ్రా దీనిపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. బజరంగ్ దళ్ జాతీయవాద సంస్థ అయితే... మంత్రుల పిల్లలందరూ బజరంగ్ దళ్‌లో చేరాలని సిఎం సర్క్యులర్ జారీ చేయాలని మిశ్రా కోరారు.

ఉనికిలోనే సార్స్ కోవి-2

- నివారణకు దేశాలు చర్యలు తీసుకోవాలి
- డబ్ల్యూహెచ్ఓ

న్యూఢిల్లీ : కోవిడ్ -19కు కారణమయ్యే సార్స్ కోవి-2 వైరస్ ఇంకా ఉనికిలోనే ఉందని, ఇతర అంటువ్యాధుల మాదిరిగానే దీని నివారణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) విజ్ఞప్తి చేసింది. ఈ ప్రారంభంలో జారీ చేసిన 'కోవిడ్ 19 గ్లోబల్ స్ట్రాటజిక్ ప్రిపేర్డ్‌నెస్, రెడీనెస్ అండ్ రెస్పాన్స్ ప్లాన్ (ఎస్‌పిఆర్‌పి) 2023' ఈ విషయాన్ని తెలిపింది. ఇప్పటికీ అంతర్జాతీయంగా ఆందోళన కలిస్తున్న కోవిడ్ మహమ్మారిపై ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని అంచనా వేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఈ నివేదికను విడుదల చేస్తోంది. వచ్చే రెండేళ్లలో కోవిడ్‌ను ఎలా ఎదుర్కోవాలో ఇందులో మార్గదర్శకాలు ఉన్నాయి. కోవిడ్-19 ప్రారంభమై నాలుగో ఏట ప్రవేశించిన సమయంలో కోవిడ్‌పై నిఘా క్షీణించిందని సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం కేసులు, మరణాలు అత్యల్ప స్థాయిలో ఉన్నప్పటికీ ఇంకా అనేక మిలియన్ల మంది సార్స్-కోవి-2 భారిన పడుతున్నారని తెలిపింది.

ముగ్గురు పాలస్తీనియన్ల హత్య

టెల్ అవీవ్ : ఇజ్రాయిలీలపై దాడితో సంబంధమున్న ముగ్గురు పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు హతమార్చినట్లు ఆ దేశ మిలటరీ గురువారం తెలిపింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నబ్లస్ నగరం నడిబొడ్డులోకి మిలటరీ గురువారం తెల్లవారు జామున ప్రవేశించిందని, భీకరంగా సాగిన పోరాటంలో ముగ్గురు అనుమానితులను హతమార్చిందని సైన్యం తెలిపింది. వీరిలో ఇద్దరు హమస్‌కి చెందినవారుగా భావిస్తున్నారు. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ముగ్గురు చనిపోయినట్లు వెల్లడించినా, వారిని గుర్తించలేదు. పాలస్తీనా ఖైదీ నిరాహార దీక్ష చేస్తూ మరణించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో నబ్లస్‌లో హింస చెలరేగింది. గత ఏడాది కాలంగా వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ అరెస్టులకు, దాడులకు పాల్పడుతోంది.

అల్లూరి స్ఫూర్తితో మోడీ విధానాలపై పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారీ పెట్టలేదని అన్నారు. చట్టాలను నాశనం చేసే బుల్డోజర్‌లా మోడీ వ్యవహరిస్తున్నారని, ఆ బుల్డోజర్‌కు వైసిపి ప్రభుత్వం చోదకునిగా సారథ్యం వహిస్తోందని విమర్శించారు. ముంపు మండలాలు పెట్టుబడిదారుల దోపిడీకి నిదర్శనంగా ఉన్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే వారికి ఎర్రజెండా అండగా నిలుస్తుందని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య మాట్లాడుతూ మతం పేరుతో మారణహోమం సృష్టించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మోడీ పాలన సాగిస్తున్నారని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్రంలో మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని దుస్థితిలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీ ఉన్నాయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు ముంపు మండలాల్లో 300 గ్రామాల్లో సుమారు మూడు లక్షల మంది గత ఏడాది వరదల్లో ముంపునకు గురయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.2 వేలు ఇచ్చి చేతులు దులుపుకుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన పది లక్షల రూపాయల పరిహారం, పునరావాసం తదితర హామీలు అధికారంలోకి వచ్చాక జగన్ బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు బిజెపిని ప్రశ్నించే ధైర్యం చేయడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, కుంజా సీతారామయ్య, లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎపి భవన్ విభజన

(మొదటి పేజీ తరువాయి)

భూమి సహా నర్సింగ్ హాస్టల్ 12.09 ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌కు అంటూ కేంద్రం ఆప్షన్-ఇ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ఎపి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆచరణీయంగా ఉందని తెలిపారని పేర్కొంది. ఆప్షన్ సి, డి, ఇలను పరిశీలించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలు వీలైనంత త్వరగా తెలిపి సమస్య పరిష్కారానికి సహకరించాలని కేంద్రం కోరింది. సమావేశంలో సంయుక్త కార్యదర్శులు సంజీవ్ కుమార్ జిందాల్, జి.పార్థసారథి, ఎపి ప్రభుత్వం తరపున కార్యదర్శి ఎల్.ప్రేమచంద్రారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, రెసిడెంట్ కమిషనరు ఆదిత్యనాథ్ దాస్, అదనపు రెసిడెంట్ కమిషనరు హిమాన్షు కౌశిక్, తెలంగాణ తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఆప్షన్ ఎ : తెలంగాణకు శబరి బ్లాకు సహా పటౌడీ హౌస్‌లో సగభాగం.. ఎపికి గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్ బ్లాకు, పటౌడీ హౌస్‌లో సగభాగం

ఆప్షన్ బి : ఎపికి పటౌడీ హౌస్ మొత్తం, శబరి బ్లాకు.... తెలంగాణకు గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్

తెలంగాణ ఆప్షన్ సి : తెలంగాణకు శబరి, గోదావరి బ్లాకులు, ఆంధ్రప్రదేశ్‌కు నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్

తెలంగాణ ఆప్షన్ డి : తెలంగాణకు శబరి, గోదావరి నర్సింగ్ హాస్టల్ 12.09 ఎకరాలు ... ఎపికి పటౌడీ హౌస్

కేంద్రం ప్రతిపాదన ఆప్షన్ ఇ : ఎపికి శబరి, గోదావరి బ్లాకులు, నర్సింగ్ హాస్టల్ సహా 12.09 ఎకరాలు.. తెలంగాణకు పటౌడి హౌస్ 7.64 ఎకరాలు




మీకోసం

గులాబీ మొక్కలు, మల్లెమొక్కలు ఎక్కువ పూలు పూయాలంటే.. మీ ఇంట్లో ఎక్స్పైరీ అయిన దగ్గు మందు ఉంటే దానిని పారేయకుండా ఒక చెంచా మందును లీటరు నీటిలో కలిపి రాత్రంతా అలానే ఉంచి ఉదయం మొక్కల పాదుల్లో పోయాలి.

జీవన సౌరభం

అహంకారం సృష్టించే చీకటిని ఛేదించడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

సమతా సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్



పిల్లలూ, ఈ రోజు ఆర్థిక శాస్త్రవేత్త, తత్త్వవేత్త కార్ల్ మార్క్స్ జయంతి. ఆయన గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందామా!

కార్ల్ మార్క్స్ జర్మనీలో ట్రీర్ అనే పట్టణంలో ఒక యూదు కుటుంబంలో 1818 మే 5న జన్మించాడు. మార్క్స్ బాన్, బెర్లిన్, జెనా విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించాడు. 1842లో ఒక పత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. కొన్నాళ్ల తర్వాత పారిస్ వెళ్లి చరిత్ర, రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రాలను అభ్యసించాడు. అప్పుడే ఆయనలో సామ్యవాద భావాలు రూపుదిద్దుకున్నాయి. మార్క్సును, ఎంగెల్స్ పారిస్‌లో మొదటిసారి కలిసాడు. భావ సారూప్యత కలిగిన వారిద్దరూ శాస్త్రీయ కమ్యూనిజం యొక్క సైద్ధాంతిక సూత్రాలను ఆవిష్కరించటానికి, ఆ సూత్రాల ప్రకారంగా అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమ నిర్మాణం కోసం కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

మార్క్స్ తన విప్లవ కార్య కలాపాల వల్ల పారిస్ నుండి బహిష్కరించబడ్డాడు. దాంతో బ్రెజిల్ చేరుకుని అక్కడ కార్యాచరణను ప్రారంభించాడు. యూరోపియన్ నగరాలన్నింటిలో విప్లవ సమూహాలన్నీ 1847లో కమ్యూనిస్టు లీగ్‌గా ఏకీకృతమయ్యాయి. మార్క్స్, ఎంగెల్స్ ఈ లీగ్‌కు సైద్ధాంతిక డాక్యుమెంటు తయారు చేయడానికి నియమింపబడ్డారు. అలా రాసిందే కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక. ఇందులో కారల్ మార్క్స్ చారిత్రక భౌతిక వాద దృక్కోణంలో చరిత్రను వ్యాఖ్యానించాడు. 'సమాజపు చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రే. కార్మిక వర్గం సమైక్యంగా విప్లవం తీసుకొస్తే వర్గరహిత సమాజం ఏర్పడుతుంది' సూత్రీకరించాడు. ఈ ప్రణాళిక సామ్యవాద సాహిత్యాన్ని, సమస్త విప్లవకర ఆలోచనలనూ ప్రభావితం చేసింది. ఈ గ్రంథం ప్రపంచంలోని అన్ని భాషల్లోకీ అనువాదం అయింది.

మార్క్స్ తన చివరి లండన్‌లో జీవించారు. రచనా వ్యాసంగానికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ ప్రయత్నానికీ తన జీవితాన్ని అంకితం చేశాడు. సామ్యవాద సాహిత్యంలో మకుటాయమాన మనదగిన ఎన్నో రచనలు చేశాడు. వీటన్నింటి లోకి ప్రధానమైనది 'దాస్ కాపిటల్'. ఈ గ్రంథంలో మార్క్స్ సమాజంలోని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ యొక్క క్రమబద్ధమైన, చారిత్రకమైన విశ్లేషణను చేశాడు. మార్చి 14, 1883న ఆయన మరణించాడు. ఆయన ప్రతిపాదించిన సామ్యవాద సిద్ధాంతం ఎప్పటికీ సజీవమే! అది మానవ సమ సమాజానికి మేలైన మార్గం.

నేను గీసిన బొమ్మ





- దేశాయ్ ఆర్యన్ రెడ్డి,
4వ తరగతి,
స్లోకా ఇంటర్నేషనల్ స్కూల్,
హైదరాబాద్,
తెలంగాణ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రెండు బైకులతో ఒక కారు

మనసులో కోరిక బలంగా ఉన్నప్పుడు ప్రతికూల పరిస్థితులు కూడా అనుకూలంగా మారతాయి. విశాల్ మెకానికల్ ఇంజనీరింగ్ కావాలనుకున్నాడు. పేదరికం అతని ఆశలపై నీళ్లు చల్లింది. అయినా పట్టు వదలకుండా కొత్త కొత్త ఆవిష్కరణలకు ప్రయత్నాలు సాగిస్తున్నాడు. చదువుకోకపోయినా తన మేధస్సుతో పాత బైకులను ఉపయోగించి కారు తయారీకి ఎంతో శ్రమించాడు. చివరికి సాధించాడు. 19 ఏళ్ల వయసులో విశాల్ పనితనం చూసి అందరూ ప్రశంసిస్తున్నారు.





మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లా, సన్నోద్ గ్రామానికి చెందిన విశాల్‌కు చిన్నప్పటి నుంచి మెకానికల్ పనులపై మక్కువ ఎక్కువ. ఏ యంత్రాన్ని చూసిన వెంటనే దాన్ని ఊడదీసి, తిరిగి బిగించేవాడు. అతని పుట్టినరోజుకు బహుమతిగా ఇచ్చిన రిమోట్ కంట్రోల్ కారు బొమ్మను వెంటనే విడదీసి, లోపల ఏ ఏ భాగాలు ఉన్నాయో చూసి, తిరిగి కలిపాడు. పేద కుటుంబానికి చెందిన విశాల్ తండ్రి ప్రయివేటు బస్సు డ్రైవర్. తల్లి ఆశా వర్కర్. తండ్రి మద్యానికి బానిస అవడం, తక్కువ ఆదాయంతో ఇల్లు గడిచేది. తన ఖర్చుల కోసం చదువుకుంటూనే పార్ట్‌టైం కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తండ్రిని చూస్తూ పెరిగిన విశాల్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఇంటర్ చదువుతున్నప్పుడే రాంచో డ్రైవర్ కావాలని కలలు కనేవాడు. కాని ఇంట్లో ఆర్థిక సమస్యలు అనుకూలించలేదు. అయినా పట్టు వదలకుండా ఏవేవో మెకానికల్ పనులు చేస్తూనే ఉండేవాడు. షెడ్‌లో వాడకుండా పక్కనబెట్టిన మోటార్‌సైకిళ్లను ఇంటికి తీసుకొచ్చి టైర్లు, ఇంజిన్ ఊడదీసి వేరే వస్తువులుగా మార్చేవాడు. అది చూసిన ఊరిలో జనం 'చేతులు ఖాళీగా ఉండవు. అందుకే పిచ్చి పనులు చేస్తుంటాడు' అని నవ్వుకునేవారు. వారి మాటలు పట్టించుకోకుండా కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉండేవాడు. పాత బజాజ్ 'బాక్సర్' మోటార్‌సైకిల్‌ను పట్టుకున్న కొద్ది నిమిషాల్లోనే ఊడదీయగల నైపుణ్యం సాధించాడు.

కారు తయారీలా...

రెండు నెలల క్రితం విశాల్‌కు రెండు పాత బైక్‌లు దొరికాయి. వాటిని ఊడదీసి కారు తయారు చేయాలన్న ఆలోచన వచ్చింది. అయితే దానికి దగ్గ ప్లానింగ్‌తో కావాల్సిన వస్తువులను తెచ్చుకున్నాడు. అయితే ఇంటర్ పరీక్షలు పూర్తి అయిన తర్వాత ఈ ప్రాజెక్టు మొదలుపెట్టాడు. కారుకు తగ్గట్టుగా ఇనుప గొట్టాలను ఉపయోగించి, నాలుగు చక్రాల కారుగా మార్చాడు. కరెంట్ క్యారీయింగ్ కెపాసిటీ రెండూ ఉండే విధంగా అమర్చాడు. పాత బజాజ్ బాక్సర్ ఇంజిన్‌ను బిగించాడు. అయిదుగురు ప్రయాణికులు కూర్చునే విధంగా సీట్లు ఏర్పాటుచేశాడు. ప్రస్తుతానికి, ఈ కారు గంటకు 40 కి.మీ వేగంతో దూసుకుపోతుంది. లీటరుకు 35 కి.మీ మైలేజీని ఇస్తుంది. తనకు ఇష్టమైన రాంచో వాహనంగా దీనిని మలుచుకున్నాడు. దీని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. ఎవరైనా చూస్తే ఎగతాళి చేస్తారని ఎవరికీ తెలియకుండా ఊరి చివర ఓ షెడ్‌లో మెకానిక్ వర్క్ మొత్తం చేసుకున్నాడు. రెండు నెలల తర్వాత వాహనం పూర్తి చేసి రోడ్డు మీద తీసుకువచ్చాడు. ఇది చూసిన వాహనదారులు తమకూ కూడా తయారు చేసి ఇవ్వాలని కోరుతున్నారు.



విశాల్‌కు ఇటువంటి కొత్త విషయాలను కనుగొనడం, వస్తువులు తయారు చేయడం అంటే ఆసక్తి. తన ఇద్దరు స్నేహితులైన నిఖిల్, అతుల్‌తో కలిసి క్లైమాక్స్ ఎక్స్‌పరిమెంట్స్' అనే యూట్యూబ్ ఛానెల్‌ని కూడా ప్రారంభించాడు. ఖాళీ సమయాల్లో చిన్న చిన్న సైంటిఫిక్ ప్రయోగాలను వీడియోలు చేసి ఛానెల్‌లో అప్‌లోడ్ చేస్తాడు. ఎల్‌పిజి సిలిండర్‌తో ట్రాక్టర్‌కు శక్తినివ్వడం, ఏమి జరుగుతుందో చూడటానికి పాత టెలివిజన్ సెట్‌ను కొండపై నుండి పడేయడం వంటి ప్రయోగాత్మక విషయాలను యూట్యూబ్‌లో పంచుకుంటున్నాడు.

పై చదువుల నిమిత్తం విశాల్‌కు డబ్బు అవసరం ఉంది. దాంతో ఈ కారు డ్రైవర్‌గా- ప్రయాణికులను ఎక్కించుకుని తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాడు. అలా వచ్చిన డబ్బుతో ఇంటి ఖర్చులకు సహాయపడుతూ... తానూ కొంత దాచుకుంటున్నాడు. చాలా మంది యువకులు తమ ప్రతిభను గుర్తించక సమయాన్ని వృథా చేస్తున్నారు. అటువంటివారికి విశాల్ ఓ ఆదర్శం.



మల్లెలు.. పలు ఉపయోగాలు

ప్రకృతిలో దొరికే అందమైన పూలలో మల్లెపూలకు ప్రత్యేక స్థానం ఉంది. మల్లె పూల పరిమళం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వేసవిలో దొరికే ఈ మల్లెలను అందానికే కాదు, ఆరోగ్యానికీ ఉపయోగించొచ్చు.

- మల్లెపూలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. మల్లెపూలను మెత్తగా నూరి తడిబట్టలో చుట్టి కళ్లమీద పెట్టుకుంటే కళ్లలో నీరు కారడం, తడి ఆరిపోవడం, కళ్ల మంటలు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మరోవైపు మల్లెపూల నుంచి తీసిన రసాన్ని ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.
- మధుమేహంతో బాధపడేవారు మల్లెపూలతో చేసిన టీ తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి.
- కొబ్బరినూనెలో నానబెట్టిన మల్లెపూల నుంచి వచ్చిన రసాన్ని తలకు రాసుకుంటే జుట్టు కుదళ్లు గట్టిపడతాయి. దీనికోసం గుప్పెడు మల్లెపూలను వేసి ఒకరోజంతా నానబెట్టాలి. ఆ తరువాత కాచి వడగట్టాలి. చల్లారాక తలకు మర్దన చేసుకోవాలి.
- మల్లెపూలను తల దిండు పక్కనే పెట్టుకుని నిద్రిస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుంది. గుండెకి సంబందించిన వ్యాధులు ఉంటె, ఒక కప్పు మల్లె పూల టీ ని రోజు తీసుకోవాలి. దీని వలన మల్లె పువ్వు లోని క్యాటెచిన్స్, చెడు కొలెస్ట్రాల్‌ని నిరోధిస్తుంది.
- పువ్వు లో ఉండే కాటెచిన్స్ ఆక్సీకరణ ప్రక్రియ ని నిరోధిస్తుంది. దీని వలన ఒత్తిడి, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. మల్లె పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక స్థాయిలో ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తొలగించడానికి సహాయ పడతాయి.
- మల్లెలో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉపిరితిత్తుల కాన్సర్, రొమ్ము కాన్సర్, చర్మ కాన్సర్, మూత్రాశయ క్యాన్సర్ కారకాలను వ్యతిరేకంగా పోరాడుతుంది.



దీపక్ శుభారంభం

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

తస్కెంట్(ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో దీపక్ భోరియా, గోవింద్ సహాని శుభారంభం చేశారు. గురువారం జరిగిన 51కిలోల విభాగంలో 2019 ఆసియా క్రీడల రజిత పతక విజేత దీపక్ 5-0పాయింట్ల తేడాతో కొలంబియాకు చెందిన లూయిస్ డెల్గాండోపై ఘన విజయం సాధించాడు. ఇక 48కిలోల విభాగంలో గోవింద్ సహాని కూడా 5-0పాయింట్ల తేడాతో తజకిస్తాన్‌కు చెందిన మెహ్రూన్ షఫీవ్‌పై గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇక ఆరుసార్లు ఆసియా క్రీడల పతక విజేత శివ థాపా, నరేంద్ర బెర్వాల్ గురువారం జరిగే తొలిరౌండ్ పోటీల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



సన్‌రైజర్స్ మరోసారీ..

కోల్‌కతా చేతిలో ఐదు పరుగుల తేడాతో ఓటమి

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేజేతులా ఓటమిపాలైంది. కోల్‌కతా నిర్దేశించిన 172పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సన్‌రైజర్స్ జట్టు చివరి వరకు పోరాడి 166పరుగులే చేయగల్గింది. హైదరాబాద్ విజయానికి చివరి 6బంతుల్లో 9పరుగులు చేయాల్సి రాగా.. వరణ్ చక్రవర్తి వేసిన బౌలింగ్‌లో కేవలం 3పరుగులే చేసి ఓటమిపాలైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు శుభారంభం దక్కలేదు. స్టార్ బ్యాటర్ జేసన్ రాయ్(20) రాణించినా.. గుర్బాజ్(0), వెంకటేశ్ అయ్యర్(7) నిరాశపరిచారు. ఆ తర్వాత కెప్టెన్ నితీశ్ రాణా(42), రింకూ సింగ్(46), ఆండీ రస్సెల్(24) బ్యాటింగ్‌లో మెరిసారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ నరైన్(1), శార్దూల్ ఠాకూర్(8), అనుకుల్ రాయ్(13), హర్షిత్ రాణా (0)ను త్వరగా పెవీలియన్‌కు పంపడంలో సన్‌రైజర్స్ బౌలర్లు సఫలమయ్యారు. దీంతో కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 171పరుగులు చేసింది. జెన్సన్, నటరాజన్‌కు రెండేసి, భువనేశ్వర్, కార్తీక్ త్యాగి, మార్‌క్రమ్, మార్ఖండేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 54పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డా.. కెప్టెన్ మార్‌క్రమ్(41), క్లాసెన్(36) విజయతీరాలకు చేర్చినా.. లోయర్ ఆర్డర్స్ బ్యాటర్స్ నిరాశపరిచారు. శార్దూల్, అరోరాకు రెండేసి, వరుణ్ చక్రవర్తి, రాయ్, రస్సెల్, హర్షిత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఐపిఎల్‌లో నేడు..
రాజస్తాన్ × గుజరాత్
(వేదిక: జైపూర్; రా.7.30గం॥లకు)

ఉత్తమ్‌సింగ్‌కు పగ్గాలు

ఆసియాకప్ జూనియర్ హాకీ



బెంగళూరు: ఈనెల 23నుంచి ఓమన్ వేదికగా జరగనున్న ఆసియా జూనియర్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు ఫార్వర్డ్ ఆటగాడు ఉత్తమ్‌సింగ్ సారథ్యం వహించనున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని కరమ్‌పూర్ గ్రామానికి చెందిన ఉత్తమ్ సింగ్ గత ఏడాది నవంబర్‌లో సుల్తాన్ జొహర్‌కప్‌లో ఆస్ట్రేలియాపై భారత్ 5-4గోల్స్ తేడాతో గెలుపుకు దోహదపడ్డాడు. గత ఏడాది సుల్తాన్ జొహర్‌కప్‌లో ఆడిన ఉత్తమ్‌సింగ్‌కు మళ్లీ పగ్గాలు అప్పగిస్తున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. సుల్తాన్ జొహర్‌కప్‌లో సడన్‌డెత్‌లో భాగంగా రెండుసార్లు షూటౌట్‌లోనూ గోల్స్ కొట్టాడు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టు ఎఫ్ఐహెచ్ జూనియర్ పురుషుల ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ ప్రపంచకప్ డిసెంబర్‌లో మలేషియా వేదికగా జరగనుంది. ఇక గ్రూప్-ఏలో భారత్‌తోపాటు పాకిస్తాన్, జపాన్, థాయ్‌లాండ్, చైనీస్ తైపీ ఉండగా.. గ్రూప్-బిలో కొరియా, మలేషియా, ఒమన్, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్ జట్లు ఉన్నాయి.

గోల్‌కీపర్లు: మోహిత్, హిమ్‌వాన్ సిహాగ్
డిఫెండర్లు: శ్రద్ధానంద్ తివారి, రోహిత్, అమన్‌దీప్ సింగ్ లక్రా, అమీర్ అలీ, యోగేంబర్ రావత్
మిడ్‌ఫీల్డర్లు: విష్ణుకాంత్ సింగ్, రాజిందర్ సింగ్, పూవన్న, అమన్‌దీప్, సునిత్ లక్రా
ఫార్వర్డ్స్: బాబీసింగ్(వైస్ కెప్టెన్), అరజిత్ సింగ్, ఆదిత్య లలాగే, ఉత్తమ్‌సింగ్(కెప్టెన్), సుదీప్ ఛిమాకో, అంగద్‌బీర్ సింగ్.

లక్ష్యసేన్ శుభారంభం

జాతీయ బ్యాడ్మింటన్ సెలెక్షన్స్

హైదరాబాద్: ఆసియా క్రీడల ఎంపికకు జరుగుతున్న జాతీయ బ్యాడ్మింటన్ సెలెక్షన్స్ పోటీల్లో యువ షట్లర్ లక్ష్యసేన్, మిథున్ శుభారంభం చేశారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-14, 21-9తో రాఘవపై సునాయాసంగా గెలుపొందగా.. మిథున్ మంజునాథ్ 22-20, 12-21, 21-11తో మైస్నన్ మిరేబాపై చెమటోడ్చి నెగ్గాడు. ఇక మహిళల సింగిల్స్ గ్రూప్-ఏలో అస్మిత ఛాలిహా, ఉన్నతి హుడా, శ్రీయాంషి, ఆకర్షి కశ్యప్ ఉండగా.. గ్రూప్-బిలో మాల్విక బన్సోద్, అదితి భట్, ఆలీషా నాయక్, అనుపమ ఉపాధ్యాయ ఉన్నారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68